
నోట్ల తోరణం.. అమ్మ వైభవం

రూ.3.33 కోట్లతో వాసవీమాతకు అలంకరణ



మిలమిల మెరిసే కొత్త కరెన్సీ కట్టలు. తళతళలాడే నాణేలు. ఎటు చూసినా లక్ష్మీ కళ. దసరా మహోత్సవాల్లో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలోని వాసవీ మాతను మంగళవారం రూ. 3.33 కోట్లతో మహాలక్ష్మిగా అలంకరించారు. గర్భాలయం, అంతరాలయం, ముఖమండపం, ఆలయ ప్రాంగణాన్ని నోట్లు, నాణేలతో నింపేశారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ అలంకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయోధ్య కోదండ రామునికి సమర్పించే రామబాణం కూడా భక్తుల దర్శనం కోసం అక్కడ ఉంచారు. -న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

దుర్గమ్మకు అన్నవరం దేవస్థానం పట్టు వస్త్రాలు



పట్టువస్త్రాలతో వస్తున్న అన్నవరం దేవస్థానం ఛైర్మన్ రోహిత్, ఈవో రామచంద్రమోహన్ తదితరులు

దసరా మహోత్సవాల్లో భాగంగా ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గ అమ్మవారికి అన్నవరం దేవస్థానం నుంచి మంగళవారం పట్టువస్త్రాలు, పసుపు కుంకుమ, పండ్లు అందజేశారు. ఛైర్మన్ ఐ.వి. రోహిత్, ఈవో కె. రామచంద్రమోహన్‌లు కుటుంబసమేతంగా విజయవాడ వెళ్లి వీటిని సమర్పించారు. -న్యూస్‌టుడే, అన్నవరం


రివ్వున ఎగురుతూ స్వస్థలాలకు!

దసరా సమీపించింది. పిల్లలకు వారం, పది రోజులు సెలవులు ఇవ్వడంతో ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి స్వస్థలాలకు గోదారోళ్లు వచ్చేస్తున్నారు. బస్సు, రైలుతో పాటు ఆకాశయానం ద్వారా వచ్చేవారి సంఖ్య పెరుగుతోంది.

ఉమ్మడి ఉభయ గోదావరివాసుల రాకపోకల కోసం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలకు మొత్తం 20 విమాన సర్వీసులు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్నవన్నీ ఏటీఆర్ సర్వీసులు కావడంతో ఒక్కోదాంట్లో 72 మంది ప్రయాణించే సామర్థ్యం ఉంది. రోజూ 1,100 మందితో 70 శాతం ఆక్యుపెన్సీ నమోదవుతుంది. దసరా నేపథ్యంలో ఇది కాస్తా 1,400 వరకు ఉంటోంది. పూర్తిస్థాయిలో నిండుకుంటున్నాయి.

■ హైదరాబాద్‌కు డిమాండ్

గోదావరి జిల్లాలకు చెందిన వ్యాపార, రాజకీయ, ఇతర రంగాల ప్రముఖులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు హైదరాబాద్ కేంద్రంగా వచ్చి వెళుతుంటారు. డిమాండ్ ఎక్కువగా ఉండటంతో ఈ ఒక్క నగరానికే ఇండిగో విమానయాన సంస్థ ఏకంగా 14 సర్వీసులను నిర్వహిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు మూడు నగరాలకు కలిపి 1.80 లక్షల మంది ప్రయాణిస్తే అందులో సుమారు 1.27 లక్షల మంది హైదరాబాద్‌కు ప్రయాణించారు.



■ రెట్టింపైన టికెట్ ధరలు

నెల రోజుల ముందు నుంచే విమాన టికెట్ల బుకింగ్ వేగం పుంజుకుంది. ఇప్పటికే 80 శాతానికి పైగా విక్రయాలు జరిగాయని సమాచారం. ప్రయాణికుల రాకపోకలు పెరిగే అవకాశం ఉండటంతో టికెట్ల విక్రయం పెరిగితే సాధారణంగా రూ.5 వేలు ఉండే ధర అమాంతం రూ.10 వేలు దాటుతోంది.

తగినన్ని లేక..

దూర ప్రాంతాల్లో ఉపాధి కోసం వెళ్లినవారు రాకపోకలు సాగించేందుకు. అలానే పర్వదినాల్లో వచ్చేవారు కోరుకున్న సర్వీసులు తగినన్ని అందుబాటులో లేవు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నైతో పాటు దిల్లీకి డిమాండ్ ఉంది. దుబాయ్, లండన్ ఇతర దేశాలకు కనెక్టివిటీ మీద గోదావరి, కోనసీమ జిల్లాలకు చెందిన కొందరు వచ్చి వెళుతున్నారు. దిల్లీ, ముంబయి వంటి ప్రధాన నగరాలకు నేరుగా విమానాలు లేక ప్రాంతాల వారీగా పలు సర్వీసులు మారడంతో టిక్కెట్ల ధర భారమవుతోంది. రాజమహేంద్రవరం విమానాశ్రయ డైరెక్టర్ ఎస్.జ్ఞానేశ్వరరావు మాట్లాడుతూ సాధారణ రోజుల కన్నా దసరా రోజుల్లో ప్రయాణికుల సంఖ్య పెరుగుతోందన్నారు. టికెట్ల డిమాండ్ రోజులను బట్టి మారుతుందన్నారు.


మరో రెండు ప్రత్యేక రైళ్లు

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం): దసరా నేపథ్యంలో ఈ నెల 18 వరకు మరో రెండు ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. విజయవాడ- శ్రీకాకుళం రోడ్డు(07215) ప్రత్యేక రైలు ఈ నెల 9, 10, 11, 12, 14, 15, 16, 17 తేదీల్లో నడుస్తుంది. ఇది రాత్రి 8 గంటలకు విజయవాడలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5.30కు శ్రీకాకుళం చేరుకుంటుంది. శ్రీకాకుళం రోడ్డు-విజయవాడ(07216) రైలు ఈ నెల 10, 11, 12, 13, 15, 16, 17, 18 తేదీల్లో నడుస్తుంది. ఇది శ్రీకాకుళంలో ఉదయం 6.30కు బయలుదేరి సాయంత్రం 4 గంటలకు విజయవాడ వస్తుంది. ఈ రైళ్లు ఉమ్మడి జిల్లాలో నిడదవోలు, రాజమహేంద్రవరం, ద్వారపూడి, అనపర్తి, సామర్లకోట, అన్నవరం, తుని రైల్వే స్టేషన్లలో ఆగుతాయన్నారు.

నిధులు పారితే.. ప్రగతి అఖండమే

■ రూ.100 కోట్లతో గోదావరి తీరం అభివృద్ధికి నివేదిక

■ 15న కేంద్రానికి అందించనున్న పర్యాటకశాఖ



ఈనాడు, కాకినాడ

గోదావరి పుష్కరాల నాటికి అఖండ గోదావరి ప్రగతి ఫలాలు అందుబాటులోకి తేవాలన్నది పర్యాటక శాఖ ప్రణాళిక. ఈ మేరకు రూ.100 కోట్ల అభివృద్ధి పనులకు సంబంధించిన సమగ్ర పథక నివేదిక (డీపీఆర్)ను ఈనెల 15న కేంద్రానికి సమర్పించనుంది. ఈ నివేదికను ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టు ఫెసిలిటేటర్స్ -కన్సల్టెన్సీ సర్వీసెస్ (ఏపీపీఎఫ్‌సీఎస్) ప్రతినిధులు సిద్ధంచేశారు. గోదావరి పరివాహక ప్రాంతంలో పర్యాటక ప్రగతి పనులకు సంబంధించి గతనెల 21న సాంకేతిక నిపుణుల బృందం ఉమ్మడి జిల్లాలో పర్యటించింది. ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు, ఆకృతులపై ఓ స్పష్టతకు వచ్చింది. సమాచారం, మ్యాపులు సేకరించారు. గుర్తించిన పనుల్లో సాధ్యాసాధ్యాలపై కసరత్తుచేసి ఒక అంచనాకు వచ్చారు.

● రాష్ట్రంలో అఖండ గోదావరి, సంగమేశ్వరం, శ్రీశైలం, సూర్యలంక ప్రాజెక్టులకు సమగ్ర పథక నివేదికలు సిద్ధమయ్యాయి. పర్యాటక శాఖ ప్రతిపాదనలు పంపిన అనంతరం నిధుల మంజూరుపై కేంద్రం నిర్ణయం తీసుకోనుంది.

● రాష్ట్రంలో రెండు ప్రాజెక్టుల అభివృద్ధికి రూ.200 కోట్ల మంజూరుకు అవకాశం ఉంది. 2027లో గోదావరి పుష్కరాలూ ఉన్నందున అఖండ గోదావరికి రూ.100 కోట్లు వస్తాయన్న ధీమా పర్యాటక శాఖ వ్యక్తం చేస్తోంది.

రూ.వెయ్యి కోట్లతో ప్రణాళిక

రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో రూ.వెయ్యి కోట్లతో గోదావరి తీరాన్ని అభివృద్ధి చేయాలన్న ప్రణాళిక ఉంది. అఖండ గోదావరిలో భాగంగా తీరం అభివృద్ధి, విహారానికి బోట్లు ఇతరత్రా చర్యలు పర్యాటక శాఖ పర్యవేక్షణలో చేపట్టనున్నారు. రాజమహేంద్రవరం నుంచి పడవల్లో బ్రిడ్జిలంక వెళ్లి అడ్వెంచర్ గేమ్స్‌ను ఆస్వాదించి.. అక్కడ్నుంచి హేవలాక్ వంతెన వద్దకు వెళ్లి.. అక్కడి 18 స్పాన్లు మీదుగా రాజమహేంద్రవరం వచ్చేలా అభివృద్ధిచేయాలన్న ప్రతిపాదన ఉంది. ఇక్కడ బంగీజంప్‌తోపాటు పర్యాటకులకు ఆటవిడుపు, దుకాణాలు, ఇతరత్రా ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయి. వీటిలో ఏ ప్రణాళికలకు ఆమోదం దక్కుతుందన్నది కొద్దిరోజుల్లో స్పష్టత రానుంది.

కాటన్ వంతెన.. చీకటేనా

గోదావరి కాటన్ వంతెనపై అంధకారం నెలకొంది. ధవళేశ్వరం, ర్యాలి, మద్దూరు, విజ్జేశ్వరం ఆర్మ్‌లకు సంబంధించి బ్యారేజీ రోడ్డు పొడవునా ఇటీవల వేసిన దీపాలు 50 శాతం పాడైపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఈ రోడ్డు మీదుగా రాత్రి సమయంలో కాలినడకన విజయవాడ కనకదుర్గ గుడికి వెళ్లే భవానీ మాలధారులు, కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు అనేకమంది వెళ్తుంటారు. స్థానికులూ అధికశాతం ప్రయాణాలు సాగిస్తుంటారు. సమస్యను గోదావరి ప్రధాన పనుల విభాగం సహాయ ఇంజినీర్ సాయిరాం వద్ద ప్రస్తావించగా వదులుగా ఉన్న కనెక్షన్లకు తోడు కొన్నిచోట్ల కోతులు స్తంభాలు ఎక్కి దీపాలను పాడు చేస్తున్నాయన్నారు. లోపాలను సరిచేసి ఇబ్బందుల్లేకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, ఆత్రేయపురం



నిత్యావసరాల ధరల నియంత్రణకు ఆదేశం

రాజమహేంద్రవరం కలెక్టరేట్: నిత్యావసర సరకులు, కూరగాయల ధరలను నియంత్రించి వినియోగదారులకు అందుబాటులో ఉండేలా ప్రత్యక్ష పర్యవేక్షణ చేపట్టాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఎస్.చిన్నరాముడు సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ధరల నియంత్రణ కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో కూరగాయల ధరలు అధికంగా ఉన్నందున వాటిని నియంత్రించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. రైతుబజార్లలో టమాటా, ఉల్లిపాయలను రాయితీ ధరలతో అందుబాటులో ఉంచామని.. ఇతర కూరగాయలు, ఆకుకూరలు సరసమైన ధరలకు అందుబాటులో ఉండేలా కమిటీ సభ్యులు చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు.

టమాటా రూ.50, కర్నూలు ఉల్లి రూ.35: జిల్లాలోని రైతుబజార్లలో కేజీ టమాటా రూ.50, కర్నూలు ఉల్లిపాయలు రూ.35, మహారాష్ట్ర ఉల్లి రూ.50కు అందుబాటులో ఉంచినట్లు జేసీ తెలిపారు. పండగ సందర్భంగా ధరల నియంత్రణకు ప్రత్యేక నిఘా పెట్టాల్సి ఉందన్నారు. సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి సునీల్ వినయ్, జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రసాద్, జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి శ్యాముల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా చెట్టు.. చిగురించేట్టు

కుమారదేవం నిద్రగన్నేరు పునరుజ్జీవం

కొవ్వూరు పట్టణం, చాగల్లు, న్యూస్‌టుడే: ఎన్నో ప్రకృతి విపత్తులను తట్టుకొని, సుమారు 300 సినిమాల చిత్రీకరణకు వేదికైన 150 ఏళ్ల ఆ వృక్షం నేలకూలగానే తెలుగు రాష్ట్రాలతోపాటు విదేశాల్లో ఉన్నవారు సైతం విలవిల్లాడిపోయారు. ప్రస్తుతం ఇది వివిధ చికిత్సల ఫలితంగా పునరుజ్జీవం పోసుకుంటోంది.

కొవ్వూరు మండలం కుమారదేవం లోని ఈ సినిమా చెట్టు(నిద్రగన్నేరు) వేరు నుంచి రెండుగా చీలిపోయి ఆగస్టు 5న భారీ వర్షాలు, వరదలకు గోదావరిలో పడిపోయింది. రాజమహేంద్రవరం రోటరీ క్లబ్ ఆఫ్ ఐకాన్స్ స్పందించి చెట్టు పడిపోయిన ప్రాంతాన్ని సమగ్రంగా పరిశీలించి బతికించేందుకు చర్యలు చేపట్టింది. అదే నెల 8న వేర్లు, కొమ్మలు కత్తిరించే పనులు ప్రారంభించారు. ఆయా ప్రదేశాల్లో పలు రసాయన మిశ్రమాలను అద్దారు. అవి పూసిన చోట గాలి, ధూళి తగలకుండా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం కాండం, కొమ్మల భాగాల్లో సుమారు పది చోట్ల పచ్చని ఆకులతో చిగుళ్లు వచ్చాయి. మరో నెల రోజుల్లో ఏపుగా పెరిగే పరిస్థితి ఉంది.



పడిపోయిన సినిమా చెట్టు (పాత చిత్రం)

అవాంతరాలు ఎదురైనా..

రోటరీ క్లబ్ గ్రీన్ భారత్, వనం-మనం విభాగం ద్వారా చెట్టు ప్రాజెక్టు ఛైర్మన్ రేఖపల్లి దుర్గాప్రసాద్ ప్రత్యేక పర్యవేక్షణలో రెండు నెలలుగా ఈ కార్యాచరణ నడుస్తోంది. చెట్టు గోదావరి గట్టును చేర్చి ఉండడం, ఆ ప్రదేశం కొద్దికొద్దిగా కోతకు గురవడం.. వరుసగా వర్షాలతో పనులకు తీవ్ర ఆటంకం కలిగింది. జేసీబీలతో పనిచేయడం ప్రహసనంగా మారింది. గత 10 రోజులుగా రెండు, మూడు సార్లు చిగుళ్లు వచ్చినా ఎలుకలు వాటిని తినేయడంతో ఇబ్బందులు తప్పలేదు. ముగ్గురు వ్యక్తులు నిత్యం పర్యవేక్షిస్తూ అవసరమైన రసాయనాలు అందిస్తూ శ్రద్ధ కనబరిచారు. మళ్లీ అక్టోబరు(ఒక ఏడాది) నాటికి కొమ్మలుగా విస్తరించి పదిమంది కూర్చొని సేదదీరే స్థాయికి వస్తుందని రోటరీ క్లబ్ ప్రతినిధులు చెబుతున్నారు.



చిగురించిన పచ్చదనాన్ని చూపిస్తున్న రోటరీక్లబ్ ప్రతినిధి దుర్గాప్రసాద్



చెట్టు కాండంలోంచి చిగుళ్లు



అధికారులతో చర్చిస్తున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు

14 నుంచి పల్లె పండగ వారోత్సవాలు

రాజమహేంద్రవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని 300 గ్రామ పంచాయతీల పరిధిలో పల్లె పండగ వారోత్సవాలు నిర్వహించేందుకు సన్నద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, కాలువల నిర్మాణ పనుల ప్రారంభానికి సంబంధించి మంగళవారం ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దూరదృశ్య సమావేశం ద్వారా దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 14 నుంచి 21వ తేదీవరకు నిర్వహించనున్న పల్లె పండగ వారోత్సవాల్లో ఉపాధి హామీ పథకం కింద ఆయా గ్రామ పంచాయతీల్లో 999 పనులకుగాను రూ. 96.71 కోట్లతో పరిపాలన ఆమోదం తెలిపామన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు. మంత్రి ఆధ్వర్యంలో కలెక్టర్ ప్రశాంతి, జేసీ చిన్నరాముడు, డీఆర్వో నరసింహులుతో ఎమ్మెల్యేలు గోరంట్ల, నల్లమిల్లి, బత్తుల బలరామకృష్ణ, ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకటరాజులు కలెక్టర్ ఛాంబర్‌లో సమావేశమయ్యారు. వారోత్సవ ఏర్పాట్లపై చర్చించారు. మంత్రి మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులతో కలిసి నియోజకవర్గాల వారీగా కార్యక్రమాల నిర్వహణకు రూట్ మ్యాప్ సిద్ధం చేస్తున్నామన్నారు.

ధాన్యం సేకరణకు రంగం సిద్ధం

నేడు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్న మంత్రి నాదెండ్ల

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం)

జిల్లాలో ఖరీఫ్ ధాన్యం సేకరణకు రంగం సిద్ధమయ్యింది. కొవ్వూరు డివిజన్ కాపవరం రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం లాంఛనంగా ప్రారంభించనున్నారు. తర్వాత దశల వారీగా పంట కోతలు మొదలయ్యే మండలాల పరిధిలోని కొనుగోలు కేంద్రాలను యంత్రాంగం ప్రారంభించనుంది.

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు ధాన్యం కొనుగోలుకు జిల్లాలోని ఆయా మండలాల్లో మొత్తం 220 రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ధాన్యం సేకరణపై క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ పూర్తి చేసి ఆయా కేంద్రాల్లో బాధ్యతలు అప్పగించారు. సీఎంఆర్ మిల్లులకు ధాన్యం రవాణాకు జియోట్యాగ్ ఏర్పాటు చేసిన వాహనాలను సిద్ధం చేస్తున్నారు.

జిల్లాలో ఇలా..

ధాన్యం ఉత్పత్తి అంచనా 4.42 లక్షల మెట్రిక్ టన్నులు

సేకరణ లక్ష్యం 2.30 లక్షల మెట్రిక్ టన్నులు

రైతులు వినియోగించేది 60 వేల మెట్రిక్ టన్నులు

మార్కెట్‌కు వెళ్లేది 1.52 లక్షల మెట్రిక్ టన్నులు

మొత్తం కొనుగోలు కేంద్రాలు: 220

సీఎంఆర్ మిల్లులు: 119

గుర్తించిన వేబ్రిడ్జిలు: 77



కాపవరంలో ప్రారంభించనున్న రైతుసేవా కేంద్రం

పెరిగిన కనీస మద్దతు ధర

గతేడాది కంటే ప్రభుత్వం కనీస మద్దతు ధర క్వింటాకు రూ.117 పెంచింది. గ్రేడ్-ఎ రకానికి కనీస మద్దతు ధర రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300గా నిర్ణయించింది. రైతులు ఎంచుకునే సమీప మిల్లులకే ధాన్యాన్ని తరలించడంతోపాటు ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో వారి ఖాతాలకు సొమ్ము జమ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఫిర్యాదుల స్వీకరణ

ధాన్యం సేకరణలో సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణకు జిల్లా కంట్రోల్ రూమ్ నంబరు- 83094 87151, టోల్ ఫ్రీ నంబరు 1967 లను అందుబాటులో ఉంచారు. ధాన్యం సేకరణ విషయంలో రైతులకు ఇబ్బందులు ఎదురైతే ఫిర్యాదు చేయవచ్చని జిల్లా పౌరసరఫరాల మేనేజర్ టి.రాధిక తెలిపారు.

■ ధాన్యం సేకరణకు యంత్ర సామగ్రి సిద్ధం చేశారు. 220 తేమ పరీక్ష యంత్రాల పనితీరు తనిఖీ చేసి కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచారు. రాజమహేంద్రవరం డివిజన్‌లో 27, కొవ్వూరులో 50 వే బ్రిడ్జిలు గుర్తించారు.

■ గోనె సంచులను ప్రభుత్వమే ఉచితంగా రైతులకు సరఫరా చేయనుంది. జిల్లాకు 57.50 లక్షల గోనె సంచులు అవసరం కాగా ఇప్పటి వరకు నాలుగు లక్షల వరకు సంచులను సరఫరా చేసి అందుబాటులో ఉంచినట్లు అధికారులు చెబుతున్నారు.

◆ రైతులే గోనె సంచులు, రవాణా వాహనాలు సమకూర్చుకుంటే వాటికయ్యే ఖర్చులు ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఒక్కో గోనె సంచికి రూ.3.39 పైసలు, హమాలీ ఛార్జీలు క్వింటాకు రూ.17.17 పైసల చొప్పున చెల్లిస్తుంది.

◆ వాహనం కూడా రైతులే సమకూర్చుకుంటే జిల్లాలో స్థానికంగా నిర్ణయించిన రేట్ల ప్రకారం రవాణా ఛార్జీల మేరకు చెల్లింపులు జరపనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

వెదుళ్లపల్లి సొసైటీలో ముగ్గురు ఉద్యోగులపై వేటు

వైకాపా త్రిసభ్య కమిటీ ఛైర్‌పర్సన్, సీఈవోపై క్రిమినల్ కేసులు

సీతానగరం, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం వెదుళ్లపల్లి ప్రాథమిక సహకార సంఘం (సొసైటీ)లో రూ.లక్షల నిధుల గోల్‌మాల్ కేసులో సీఈవో మట్టా సురేంద్రకుమార్, సేల్స్‌మెన్ భారతి, స్టాఫ్ అసిస్టెంట్ పోలేశ్వరరావును విధుల నుంచి తొలగిస్తున్నట్లు సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం.కృష్ణమోహన్ తెలిపారు. వైకాపా నాయకులు, సిబ్బంది కలిసి రైతుల నిధులు గల్లంతుచేయడంపై 'సిబ్బంది సహకారం స్వాహా' శీర్షికన ఈనెల 3న 'ఈనాడు'లో ప్రచురించిన కథనంపై అధికారులు స్పందించారు. సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ మంగళవారం సొసైటీలో తనిఖీలు చేపట్టారు. పలు కీలక దస్త్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీలో రూ.64 లక్షలు స్వాహాచేశారని, రూ.39 లక్షలు దశలవారీగా తిరిగి చెల్లించారని, మిగిలిన రూ.25 లక్షల వసూలుకు నోటీసులు జారీ చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ముగ్గురు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు వివరించారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో త్రిసభ్య కమిటీ ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించిన రాచూరి గోవిందు రూ.23 లక్షలు రుణం తీసుకుని తిరిగి చెల్లించకుండా సొసైటీ నుంచి దస్తావేజులు, పాసు పుస్తకాలు తీసుకెళ్లడంపై ఉద్యోగులతో పాటు ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేయించామన్నారు. సొసైటీ లావాదేవీలు యథావిధిగా నిర్వహించేలా సిబ్బందిని తాత్కాలికంగా నియమించామని, బుధవారం నుంచి ఖాతాదారులకు అన్ని రకాల సేవలు అందిస్తామనారు. సహకార శాఖ సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఏఆర్ శివకుమార్, డీసీసీబీ మేనేజర్ మిడియం క్రాంతికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



తనిఖీచేస్తున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ తదితరులు



గోడ పత్రికలు ఆవిష్కరిస్తున్న అధికారులు

218 గృహాల్లో సౌర విద్యుత్తు యూనిట్లు

రాజమహేంద్రవరం కలెక్టరేట్: పీఎం సూర్యఘర్.. పథకం కింద ఇప్పటివరకు జిల్లాలో 218 గృహాల్లో సౌర విద్యుత్తు(సోలార్) యూనిట్లు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈ పథకంపై జిల్లాస్థాయి కమిటీ తొలి సమావేశం మంగళవారం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ రాయితీతో కూడిన సోలార్ రూఫ్ టాప్ ఇళ్లపై ఏర్పాటు చేస్తే విద్యుత్తు బిల్లు ఛార్జీలు తగ్గించుకునే అవకాశం ఉందనే విషయాన్ని తెలియజేయడంతో పాటు ప్రభుత్వ పరంగా కలిగే ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. ఈ పథకంలో సోలార్ యూనిట్ల ఏర్పాటుకు ఎటువంటి ష్యూరిటీ లేకుండా రూ.రెండు లక్షల వరకు బ్యాంకులు రుణాలు అందిస్తాయన్నారు. ఒక కిలో వాట్ యూనిట్ ఏర్పాటుకు రూ.70 వేలు ఖర్చవుతుండగా దీనిలో ప్రభుత్వం రాయితీ రూ.30 వేలు, బ్యాంకు రుణంగా రూ.40 వేలు మంజూరవుతుందన్నారు. రెండు కిలోవాట్స్‌కు రూ.60 వేలు, 3 కిలోవాట్స్ రూ.78 వేలు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని వివరించారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రచార గోడ పత్రికలను ఏర్పాటు చేసేందుకు సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ప్రతినెలా వంద యూనిట్ల ఏర్పాటుకు లక్ష్యం: పథకం కింద జిల్లాలో ప్రతి నెలా వంద సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయాలనేది లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు ఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ కె.తిలక్‌కుమార్ తెలిపారు. సోలార్ యూనిట్ల స్థాపనకు జిల్లాలో 21 ఏజెన్సీలు విద్యుత్తు సంస్థతో ఎన్‌ప్యానల్మెంట్ అయినట్లు తెలిపారు. వినియోగదారుల ఆసక్తికి అనుగుణంగా ఏజెన్సీలను ఎంపిక చేసుకోవచ్చని, వాటి వివరాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. యూనిట్స్ ఏర్పాటు, ఫిర్యాదుల స్వీకరణకు 1912 టోల్‌ఫ్రీ నంబరు అందుబాటులో ఉందన్నారు.

'వైమానిక దళం' భారత్‌కు గొప్ప ఆస్తి

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆసమానమైన శౌర్యం, సమగ్రతతో దేశానికి సేవ చేసిన వైమానిక యోధులకు ఇది నివాళి అని, ఇది భారత సైనిక శక్తికి గొప్ప ఆస్తి అని వింగ్ కమాండర్ ఎన్‌సీసీ పి.ప్రవీణ్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం జేఎన్‌టీయూకే లో 9(ఆంధ్ర) వైమానిక ఎన్‌సీసీ కాకినాడ విభాగం ఆధ్వర్యంలో వైమానిక దళ దినోత్సవం జరి గింది. ముఖ్య అతిథిగా జేఎన్‌టీయూకే ఇన్‌ఛార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ వైమానిక దళ ప్రాముఖ్యతను వివరించారు. సాధారణంగా మొదట్లో ప్రపంచంలోని బలీయమైన దళాల్లో ఒకటిగా ఎదిగిందన్నారు. వింగ్ కమాండర్ ప్రవీణ్‌బాబు మాట్లాడుతూ దళాల్లోని సాంకేతిక, అంకితభావం, వ్యక్తి వైపుణ్యం, ధైర్యం ప్రదర్శించిందన్నారు. ఈ సందర్భంగా కేకు కోసి వేడుకలు నిర్వహించారు. కాకినాడ గ్రూప్ కల్నల్ సీకే.నాయక్, గర్ల్స్ విభాగ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ హెచ్‌ఎస్.మాజిక్, కోస్టుగార్డ్ కమాండింగ్ ఆఫీసర్ రాజీవ్ కుమార్, విశ్రాంత గ్రూప్ కెప్టెన్‌లు వీబీఆర్.రావు, హెచ్‌ఎస్.బాలి, ఎన్‌సీసీ ఓలు, సిబ్బంది, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.



వేడుకల్లో కేకు కోస్తున్న జేఎన్‌టీయూకే ఇన్‌ఛార్జి వీసీ మురళీకృష్ణ, కాకినాడ గ్రూప్ కల్నల్ నాయక్

బాలికపై అమానుష ఘటన బాధాకరం: వర్మ

పిఠాపురం: పిఠాపురంలో బాలికపై ఓ వ్యక్తి అత్యాచారానికి పాల్పడిన ఘటన అమానుషమని మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్‌ఎన్ వర్మ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పిఠాపురంలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, అనంతరం తెదేపా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అత్యాచారానికి పాల్పడిన తెదేపా కార్యకర్త దుర్గాడ లక్ష్మణ్ అలియాస్ జానీని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన, సహకరించినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ


ఇలాంటి ఘటనలను తెదేపా ఖండిస్తుందన్నారు. వైద్యంకోసం బాధితురాలిని కాకినాడ పంపించారని, అవసరమైతే ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయిస్తామన్నారు. పిఠాపురంలో పోలీసు స్టేషన్‌ను పెంచాలని కోరారు. ప్రధాన కూడళ్లలో ఆకతాయిల ఆగడాలు ఎక్కువవుతున్నాయని, ముఖ్యంగా చిత్రాడ, రథాలపేట, మాధవపురం రైల్వే వంతెన వద్ద గస్తీ నిర్వహించాలన్నారు. మద్యం, గంజాయి, మత్తుకు బానిసై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారన్నారు. నాయకులు సూర్యప్రకాష్, చిన్నా, శ్రీను, నగేష్, రాజా, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో బోధనేతర సిబ్బంది భర్తీకి దరఖాస్తులు

కాకినాడ నగరం: సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నడుస్తున్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) బోధనేతర సిబ్బంది భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్లు సమగ్ర శిక్షా జిల్లా ఇన్‌ఛార్జి ఏపీసీ పి.రమేష్ తెలిపారు. ఒప్పంద (కాంట్రాక్టు), పొరుగు సేవల (అవుట్ సోర్సింగ్) ప్రాతిపదికన 2024-25 విద్యా సంవత్సరానికి ఈ పోస్టులను భర్తీ చేసేందుకు పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసిందన్నారు. అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కాకినాడ జిల్లాలో టైప్-3 కింద హెడ్ కుక్ 1, అసిస్టెంట్ కుక్ 3, వాచ్‌మన్ 2, స్వీపర్ 2 పోస్టులు భర్తీ చేస్తారన్నారు. టైప్-4 కింద అసిస్టెంట్ కుక్ 1 పోస్టును భర్తీ చేస్తారని వివరించారు. సంబంధిత ఎంఈవో కార్యాలయాల్లో 15లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసీ కేటగిరీకి 18-42 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు 5 ఏళ్లు, మాజీ సైనికోద్యోగులకు 3 ఏళ్లు, దివ్యాంగులకు 10 ఏళ్లు సడలింపు ఉంటుందన్నారు.

వీఆర్‌కు అనపర్తి సీఐ శివగణేష్

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: అనపర్తి సీఐగా విధులు నిర్వర్తిస్తున్న శివగణేష్‌ను వీఆర్‌కు బదిలీ చేశారు. ఏలూరు డీఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. అనపర్తి సీఐగా ఆయన 2023 అక్టోబర్ 26న బాధ్యతలు స్వీకరించారు. ఏడాది కాలం పాటు పనిచేసిన తర్వాత ఆయనను బదిలీ చేశారు.



గోకవరం: దేవీచౌక్‌లో రూ.30లక్షల కరెన్సీ నోట్లతో మహాలక్ష్మీదేవి అలంకరణ



తాళ్లపూడి: రూ.10లక్షల నోట్లతో అమ్మవారికి అలంకరణ



అనపర్తిలో నోట్లతో అలంకృతమైన అమ్మవారు

దుర్గామాతా.. నమోస్తుతే

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అమ్మవారిని రోజుకో రూపంలో అలంకరించి పూజలు చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో మంగళవారం అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. - న్యూస్‌టుడే, బృందం

సెలవుల్లో బోటు షికారు చేద్దామా..

న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

అఖండ గోదావరి తీరంలో అందాలు తిలకించేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతారు. వివిధ పనుల నిమిత్తం రాజమహేంద్రవరం వచ్చిన జిల్లావాసులతో పాటు దసరా సెలవులకు వచ్చిన బంధువులు, పిల్లలు బోటు షికారుకు వస్తున్నారు. నగరంలోని పద్మావతిఘాట్, పుష్కరఘాట్, సరస్వతి ఘాట్లలో బోటు షికారు అందుబాటులో ఉంది. ఏపీ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బోటు షికారుకు రాజమహేంద్రవరంలో మూడు కేంద్రాలున్నాయి.



పద్మావతి ఘాటులో స్పీడు బోటులో ప్రయాణం

సమయం: ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు బోటు షికారులో గోదావరిలో విహరించవచ్చు.

ఘాట్	బోటు	ఎంతమందికి అవకాశం
పద్మావతి	స్పీడ్ బోట్	3
పద్మావతి	పాంటూన్	18
పద్మావతి	చిత్రాంగి	25
పుష్కర	మేజువాణి	25
సరస్వతి	ధరణి	12

టికెట్ ధర ఇలా..

- పద్మావతిఘాట్‌లో మాత్రమే స్పీడు బోటు అందుబాటులో ఉంది. ఇందులో ముగ్గురు ప్రయాణించేందుకు రూ.500 చెల్లించాలి. గోదావరిలో అరు నిమిషాలు విహరించవచ్చు.
- పాంటూన్, చిత్రాంగి బోట్లలో షికారు చేయడానికి పెద్దలకు రూ.70, పిల్లలకు రూ.50 చెల్లించాలి.
- పుష్కర ఘాట్‌లో మేజువాణి బోటులో షికారు చేయడానికి పెద్దలకు రూ.70, పిల్లలకు రూ.50 టికెట్ రుసుం చెల్లించాలి.
- సరస్వతీఘాట్‌లో ధరణి బోటులో షికారు చేయడానికి పెద్దలకు రూ.150, పిల్లలకు రూ.100 చెల్లించాలి. గోదావరి రెండు వంతెనల మధ్యలో 20 నిమిషాలు విహరించవచ్చు.

వేడుకలకు ప్రత్యేకం

గోదావరి నదిలో ప్రయాణిస్తూ వేడుక జరుపుకోవాలని అభిలాష కలిగిన వారికి ప్రత్యేకంగా అవకాశం కల్పిస్తున్నారు. 25 మందిని అనుమతించే బోటులో వేడుక నిర్వహించుకునేందుకు రూ.4,500 చెల్లించాలి. గంట సమయం గోదావరి మధ్యలో బోటులో ప్రయాణిస్తూ సందడిగా వేడుక జరుపుకోవచ్చు. పద్మావతి ఘాట్‌లోని కార్యాలయంలో సంప్రదించి బోట్ బుక్ చేసుకోవాలి. నిబంధనలు వర్తిసాయి.



చిత్రాంగి బోటులో షికారు చేస్తున్న పర్యాటకులు

పర్యాటకులు లైఫ్ జాకెట్ ధరించాలి..

బోటు షికారుకు వచ్చే ప్రతి పర్యాటకులు తప్పనిసరిగా లైఫ్ జాకెట్ ధరించాలి. పండుగ సమయం కావడంతో సాధారణ రోజుల్లో 400, శని, ఆదివారాల్లో 800 నుంచి 1000 మంది వరకు పర్యాటకులు బోటు షికారుకు వస్తున్నారు. వేడుకల నిర్వహణకు వీలుగా బోటుషికారు అందుబాటులో ఉంటుంది. వరదల కారణంగా నిలిచిన పాపికొండలు విహారయాత్ర త్వరలో ప్రారంభమవుతుంది.

- ఆర్.గంగబాబు, బోటింగ్ మేనేజర్, ఏపీ టూరిజమ్

నవంబరులో ఏపీ సాంస్కృతిక వైభవం సదస్సు

నన్నయ విశ్వవిద్యాలయం (రాజానగరం), న్యూస్‌టుడే: నన్నయ విశ్వవిద్యాలయంలో నవంబరు 7, 8 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవం సదస్సు నిర్వహించనున్నామని వర్సిటీ వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు. సదస్సుకు సంబంధించిన గోడపత్రికలను వర్సిటీలో మంగళవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్సిటీలోని ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ఆంగ్ల విభాగం, సెంటర్ ఫర్ ఆంధ్రప్రదేశ్ స్టడీస్ (కాప్స్) విజయవాడ సంయుక్త ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తామని వివరించారు. కన్వీనర్లుగా ఆచార్య కె.శ్రీరమేష్, ఆచార్య డి.జ్యోతిర్మయి, డా.ఎన్.సజనా రాజ్ వ్యవహరిస్తారని వెల్లడించారు.



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య శ్రీనివాసరావు తదితరులు

పత్ర సమర్పణలకు ఆహ్వానం..

రాష్ట్ర మౌలిక అస్తిత్వాన్ని ప్రభావితం చేసే అంశాలపై పత్ర సమర్పణలను ఆహ్వానిస్తున్నామని వీసీ తెలిపారు. అవధానం, దండకం, శతకం, పద్య కవిత్వం తదితర సాహిత్య ప్రక్రియలు, కూచిపూడి, ఆంధ్ర నాట్యం, ధింసా గిరిజన నృత్యాలు, జానపద కళారూపాలు, బుర్రకథ, హరికథ, తోలుబొమ్మలాట, తప్పెటగుళ్లు, మొదలైన సాహిత్య జానపద, సాంస్కృతిక అంశాలపై రచనలు ఆహ్వానిస్తున్నామని చెప్పారు. వ్యవసాయం, సంస్కృతి, ఆహారపుటలవాట్లు, వస్త్రధారణ రీతులు, శిల్ప నిర్మాణ శాస్త్రాలు, క్రీడలు, పండుగలు, ఉత్సవాలు, హస్త కళారూపాలు, జీవన విలువలు, సంస్కరణలు, సేవాభావం, విశ్వబంధు భావన తదితర సాంస్కృతిక అంశాలపై సదస్సులో చర్చలు ఉంటాయన్నారు.

25వ తేదీ లోపు రిజిస్ట్రేషన్..

సదస్సులో పాల్గొనేవారు ఈనెల 25లోగా రిజిస్ట్రేషన్ చేయించుకుని, పరిశోధన పత్రాలు సమర్పించాలని వీసీ కోరారు. పూర్తి వివరాలు యూనివర్సిటీ వెబ్‌సైట్ నుంచి పొందాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, కాప్స్ అధ్యక్షుడు, ప్రముఖ మానసిక వైద్యుడు కర్రి రామారెడ్డి, ఓలేటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సుస్థిర పాలన: పళ్లంరాజు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీతోనే దేశంలో సుస్థిర పాలన సాధ్యమని ఏఐసీసీ సభ్యుడు డాక్టర్ ఎం.ఎం.పళ్లంరాజు పేర్కొన్నారు. నూతనంగా నియమితులైన ఏపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మట్టా శివప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లిపూడి రాంబాబు, నక్కా సత్యనారాయణ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందం, కాకినాడ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు చెక్కా నూకరాజు జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం ప్రమాణస్వీకారం చేశారు. సభలో పళ్లంరాజు మాట్లాడుతూ అన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ పుంజుకుంటోందని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అధికారం చేజిక్కించుకుంటామన్నారు. బాధ్యతలు చేపట్టిన నాయకులను సత్కరించారు. ఏపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి మస్తాన్‌వలీ, నాయకులు టీకే విశ్వేశ్వరరెడ్డి, కామన ప్రభాకరరావు, బండారు జయప్రకాశ్, అయితాబత్తుల సుభాషిణి, దాట్ల గాంధీరాజు, తాళ్లూరి రాజు, బత్తిన లలిత తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు

క్యూఆర్ కోడ్‌తో చందాల సేకరణ

దసరా ఉత్సవాలకు కొందరు చిన్నారులు చందాలు వసూలు చేసే పద్ధతి పలువురిని ఆశ్చర్యపరిచింది. మండలంలోని తాడిపర్రులో చిన్నారుల ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలను ప్రత్యేకంగా చేపట్టారు. దీనిలో భాగంగా చందాలు సేకరించటానికి హుండీతోపాటు ఫోన్‌పే క్యూఆర్ కోడ్‌ను ఉపయోగిస్తున్నారు. దీంతో ఉత్సవాలు నిర్వహించటానికి విరివిగా విరాళాలు వస్తున్నాయి. ఈ చిన్నారుల తెలివితేటలను అందరు అభినందిస్తున్నారు. **- న్యూస్‌టుడే, ఉండ్రాజవరం**



తాడిపర్రులో చందా సేకరిస్తున్న చిన్నారులు

కాలం చెల్లిన స్నాక్స్ ప్యాకెట్ల పట్టివేత

టి.నగర్, ఏవీఏ రోడ్డు(రాజమహేంద్రవరం): చిరుతిళ్ల(స్నాక్స్)కు సంబంధించి కాలం చెల్లిన ప్యాకెట్లు భారీ సంఖ్యలో రాజమహేంద్రవరంలో ఓ గోదాములో బయటపడ్డాయి. ముందస్తు సమాచారం మేరకు ఆహార భద్రత(ఫుడ్ సేఫ్టీ) విభాగం అధికారులు నగరంలోని గాంధీపురం-1, ధనలక్ష్మీ ఏజెన్సీలో మంగళవారం దాడులు నిర్వహించారు. ఓ బ్రాండెడ్ కంపెనీకి చెందిన స్నాక్స్ ప్యాకెట్లు గుర్తించారు. అవన్నీ కాలం చెల్లినవిగా గుర్తించారు. వీటి విలువ రూ.లక్ష ఉంటుందని జిల్లా ఆహార తనిఖీ విభాగం అధికారి రొక్కయ్య చెప్పారు. కాలం చెల్లినవి సేకరించడంపై చట్ట ప్రకారం కేసు నమోదు చేశామన్నారు. ఆహార కల్తీ, ఇలాంటి విక్రయాలపై జిల్లావాసులు అప్రమత్తంగా ఉండాలన్నారు.



వివరాలు సేకరిస్తున్న అధికారుల బృందం

రాజధాని పునర్నిర్మాణానికి రూ.3,12,716 విరాళం

చాగల్లు, కొవ్వూరు పట్టణం: అమరావతి రాజధాని నిర్మాణానికి తన వంతు సహాయంతో పాటు కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, పలువురి నుంచి విరాళాలు సేకరించి మంత్రి నారా లోకేశ్‌కు అందించినట్లు ఏబీఎన్, పీఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ నందిగం సుబ్బారావు తెలిపారు. అమరావతిలోని కార్యాలయంలో మంగళవారం లోకేశ్‌ను కలిసి విరాళాల సొమ్ము రూ.3,12,716ల డీడీని అందించామన్నారు. నాయకులు నందిగం రవి చంద్రబాబు, అధ్యాపకులు పి.శ్రీనివాసప్రవీణ్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.



లోకేష్‌కు చెక్కును అందిస్తున్న ప్రిన్సిపల్ సుబ్బారావు, తదితరులు

విశాఖలో వాహనం.. తునిలో గొలుసు దొంగతనం

మహిళ మెడలో ఆభరణాలు లాక్కెళ్లిన దుండగులు

తుని, తుని పట్టణం, న్యూస్‌టుడే: విశాఖ ఎంవీపీ కాలనీ ప్రాంతంలో సోమవారం తెల్లవారుజామున ఓ ఇంటి వద్ద నిలిపి ఉంచిన ఖరీదైన బైక్‌ను ఇద్దరు దుండగులు చోరీ చేశారు. తెల్లవారుజామున సుమారు 3.30 గంటల సమయంలో ఈ బైక్ చోరీ జరిగినట్లు అక్కడి సీసీ కెమెరాలో దృశ్యాలు నమోదయ్యాయి. అనంతరం సుమారు 100 కి.మీ. దూరంలో తుని పట్టణానికి అదే బైక్‌పై వచ్చి సంచరించినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఓ గ్రామీణ ప్రాంత మహిళను లక్ష్యంగా చేసుకుని దుండగులు మధ్యాహ్నం 3.30 గంటలకు మెడలోని సుమారు 40 గ్రాముల బరువు ఉన్న రూ.2.50 లక్షల విలువైన బంగారపు ఆభరణాలు లాక్కెళ్లిపోయారు. ఈ చోరీ దృశ్యాలు కూడా దగ్గరలోని ఓ దుకాణంలో ఉన్న సీసీ కెమెరాలో నమోదయ్యాయి. విశాఖలో బైక్ చోరీ చేసిన సమయానికి సరిగ్గా 12 గంటల వ్యవధిలో ఇక్కడ చోరీ జరగడం గమనార్హం. మండలంలోని వెలమకొత్తూరు నుంచి పట్టణంలోని వస్త్ర దుకాణానికి వచ్చిన బాధితురాలు లక్ష్మీ తిరుగు ప్రయాణమైన సందర్భంలో ఈ దాడి జరిగింది. ఇద్దరు చోరుల వయసు పాతికేళ్లలోపే ఉంటుంది. ప్రత్యేక బృందాలు గాలింపు ప్రారంభించాయి. దుండగులు విశాఖలో దొంగిలించిన బైక్‌పైనే ఇటు వచ్చి చోరీ చేశారని సీఐ ఎం.గీతా రామకృష్ణ తెలిపారు. తుని నారాయణ రాజుగారి వీధిలో చోరీ చేశాక మెయిన్ రోడ్డు నుంచి బెల్లపువీధి వైపు వెళ్లిన దుండగులు మళ్లీ అటు విశాఖ వైపునకు వెళ్లారా? లేక రాజమహేంద్రవరం వైపు పయనం అయ్యారా? అనేది పరిశీలిస్తున్నారు.



విశాఖలో బైక్ చోరీ చేస్తున్న దుండగులు



తునిలో మహిళ మెడలో పుస్తెలతాడు లాక్కొనిపోతున్న చోరులు

సరదాగా తిరుగుదామని చెప్పకుండా వచ్చేశారు..

నలుగురు బాలికలు తల్లిదండ్రులకు అప్పగింత

దానవాయిపేట: ఆన్‌లైన్‌లో పరిచయమైన నలుగురు బాలికలు దసరా సెలవుల వేళ ఇంట్లో చెప్పకుండా వేరే ప్రాంతానికి బయలుదేరారు. మహిళా రక్షక్ పోలీసులు వీరిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించిన ఘటన రాజమహేంద్రవరంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. రాజమహేంద్రవరం మహిళా స్టేషన్ సీఐ మంగాదేవి వివరాల మేరకు.. ఈ నెల 7న అర్ధరాత్రి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అనుమానాస్పదంగా ఉన్న నలుగురు బాలికలను మహిళా రక్షక్ టీమ్ ప్రశ్నించింది. వారు పొంతనలేని సమాధానం చెప్పడంతో స్టేషన్‌కు తీసుకువెళ్లి విచారించారు. వారిలో ఇద్దరు రాజమహేంద్రవరానికి చెందిన వారు కాగా.. మరో ఇద్దరు రావులపాలెం ప్రాంతానికి చెందిన బాలికలుగా గుర్తించారు. ఇద్దరు పదో తరగతి, మరో ఇద్దరు ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. నలుగురికి ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. విజయదశమి సెలవులు కావడంతో నాలుగు రోజులు పాటు విశాఖకు వెళ్లి సరదాగా గడపాలని నిర్ణయించుకున్నారు. ఇంట్లో చెబితే ఒప్పుకోరని ఆలయానికి వెళ్తామని కుటుంబీకులకు చెప్పి సోమవారం మధ్యాహ్నం బయటకు వచ్చేశారు. రాత్రి రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకున్నారు. మంగళవారం ఉదయం వీరి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చిన అనంతరం బాలికలను అప్పగించినట్లు సీఐ తెలిపారు. జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ రక్షక్ టీమ్‌ను అభినందించారు. పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	11,500
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	14,000-15,000
కొత్త (పచ్చి) కాయ	13,500-14,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	120-00
రిటైల్ లైవ్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

ఉత్కంఠగా అంతర్ జిల్లాల హ్యాండ్‌బాల్ పోటీలు

దివాన్‌చెరువు (రాజానగరం): దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హ్యాండ్‌బాల్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. మంగళవారం రాజమహేంద్రవరం డీవీఈఓ నారాయణ క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలు తిలకించారు. ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ స్వామి, పరిశీలకుడు నాగేంద్ర, గంగాధర్ పీడీలు బి.రామకృష్ణ, ప్రసాద్, వీరబాబు, విద్యా సంస్థ మేనేజర్ ఏఎస్ఎన్ మూర్తి, ప్రిన్సిపల్ విమల పాల్గొన్నారు.



తూర్పుగోదావరి, అనంతపురం జిల్లా జట్ల మధ్య పోటీ

విజేతలు వీరే..

లీగ్, నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తున్న పోటీలలో మంగళవారం నాటి విజేతలు: తూర్పుగోదావరిపై నెల్లూరు, కృష్ణాపై అనంతపురం, కడపపై చిత్తూరు, ప్రకాశంపై విశాఖపట్నం, గుంటూరుపై కర్నూలు, నెల్లూరుపై కృష్ణా, అనంతపురంపై తూర్పుగోదావరి, శ్రీకాకుళంపై చిత్తూరు, గుంటూరుపై విజయనగరం జిల్లా జట్లు విజయాలు సాధించాయి.



పీఈటీలను పరిచయం చేసుకుంటున్న డీవీఈఓ నారాయణ


రాజమహేంద్రవరం

రైతుబజారులో నిన్నటి ధరలు(రూ.లో)



దేవీచౌక్, న్యూస్‌టుడే: టమాట-50/44, వంకాయలు (నలుపు-36/గులాబీ-48/తెలుపు-36/దొమ్మేరు-48), బెండ-36, కాకర-38, బీర పందిరి-50/45, దొండ-48, క్యారెట్-40, బీట్‌రూట్-34, గోరుచిక్కుళ్లు-40, దోస-34, ఆనబకాయ-45/40, చిక్కుళ్లు-76/దేశవాళీ-86, పచ్చిమిర్చి-24, బంగాళదుంపలు-32, ఉల్లిపాయలు-50/కొత్తవి-35.

శాంతిస్వరూపిణి



శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: నగరానికి చెందిన మోటూరి శ్రీ అమ్మవారి చిత్రాన్ని గీశారు. శాంతస్వరూపిణిగా అమ్మవారు దర్శనమిస్తున్నట్లు వేసిన చిత్రం ఆకట్టుకుంటోంది.

మోటూరి శ్రీ గీచిన చిత్రం

దేవీచౌక్ కూడలిలో ట్రాఫిక్ ఇక్కట్లు



వాహనాలతో గజిబిజిగా దేవీచౌక్ కూడలి

– న్యూస్‌టుడే, దేవీచౌక్

నగరంలోని ప్రముఖ వాణిజ్య కేంద్రం దేవీచౌక్‌లో వాహన చోదకులకు నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. అయిదు రోడ్ల కూడలి కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటోంది. దీనికి తోడు రోడ్డుకు ఇరువైపులా వాహనాలను ఇష్టానుసారంగా నిలిపివేయడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఇక్కడ రద్దీకి అనుగుణంగా ట్రాఫిక్ సిబ్బంది ఉండడం లేదు. దేవీచౌక్ నుంచి లక్ష్మీవారపుపేట, కోటగుమ్మం వెళ్లే మార్గంలో ఎక్కువ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అసలే ఇరుకు రోడ్డు కావడం.. కార్లు, ఆటోలను గంటల తరబడి రోడ్డు పక్కన నిలివేయడంతో ద్విచక్ర వాహన చోదకులకు అవస్థలు తప్పడం లేదు. దేవీచౌక్ నుంచి జెండా పంజా రోడ్డు వరకు ఈ సమస్య ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. దేవీచౌక్ సెంటర్‌లో ట్రాఫిక్ నియంత్రణకు కేవలం ఒక కానిస్టేబుల్‌నే నియమిస్తున్నారని, దీనివల్ల ఇతర మార్గాల్లో వాహనాల నియంత్రణ కష్టమవుతోందని చెబుతున్నారు.

✦ నగర సుందరీకరణలో భాగంగా గత ప్రభుత్వంలో దేవీచౌక్ చుట్టూ వేసిన రాళ్ల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షం వస్తే ద్విచక్ర వాహన చోదకులు జారిపడిపోతున్నారు. ఈ సమస్యలు పరిష్కరించాలని నగరవాసులు కోరుతున్నారు.



లక్ష్మీవారపుపేట రోడ్డులో నిలిచిన వాహనాలు

ఆర్యాపురం.. రహదారులు చెత్తమయం



సత్యనారాయణస్వామి ఆలయం వెనుక వీధిలో రోడ్డుపై చెత్త

దేవీచౌక్, న్యూస్‌టుడే: ఆర్యాపురంలో వీధులు చెత్తమయంగా మారుతున్నాయి. గతంలో మాదిరి వీధుల్లో చెత్త కుండీలు లేకపోవడం, ఇంటింటా చెత్త సేకరణకు సిబ్బంది సక్రమంగా రాకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు చెబుతున్నారు. చెత్తతోపాటు నిర్మాణ వ్యర్థాలు సైతం రోడ్లపైనే ఉంటున్నాయి. సత్యనారాయణస్వామి ఆలయం వెనుక వీధిలో చెత్త రోడ్డు పక్కన పేరుకుపోయింది. సుంకరవారివీధిలోని కృష్ణసాయి మందిరం వద్ద మూడు నెలల క్రితం నిర్మాణ వ్యర్థాలు వేశారు. అవి ఇప్పటికీ తొలగించింది లేదు. పలు వీధుల్లో సీసీ దారులు దెబ్బతిన్నాయి. చాలాకాలం క్రితం వేసిన సిమెంటు రోడ్లకు గుంతలు, పగుళ్లు ఏర్పడ్డాయి. వీధుల్లో చెత్త లేకుండా చర్యలు తీసుకోవడంతోపాటు రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని నివాసితులు నగరపాలకులను కోరుతున్నారు.

సినిమాలు: దానవాయిపేట: రాజా, వీఎస్ మహల్, అశోక, కుమారి, సూర్యప్యాలస్, అప్సర: దేవర, స్వామి, అనుశ్రీ: స్వాగ్, శ్యామల: 35 చిన్నకథకాదు, సూర్యమినీ: దక్షిణ, శివజ్యోతి: రామ్‌నగర్ బన్నీ, రంభ: కమిటీ కుర్రోళ్లు, ఊర్వశి: సత్యం సుందరం, మేనక: మత్తు వదలరా-2, మిస్టర్ సెలబ్రిటీ(రెండు ఆటలు).

వృద్ధులకు ప్రేమాభిమానాలు

రాజానగరం, న్యూస్‌టుడే: ఎన్‌సీసీ ప్రత్యేక జాతీయ సమైక్యత శిబిరంలో భాగంగా గైట్ ఇంజినీరింగ్ కళాశాల క్యాడెట్లు మంగళవారం వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వృద్ధులను ఆప్యాయంగా పలుకరించి వారికి అనురాగాలు పంచారు. వారి కుటుంబ సభ్యుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆహార పదార్థాలను వడ్డించి తినిపించారు. భావోద్వేగానికి గురైన వారి కన్నీరు తుడిచి అక్కున చేర్చుకుని దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ చర్యలతో వృద్ధులు ఆనందపరవశులయ్యారని క్యాంప్ డిప్యూటీ కమాండర్, మేజర్ ఆసిఫ్ సాహెబ్ తెలిపారు. అనంతరం క్రీడా పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కాకినాడ గ్రూప్ కమాండర్ కర్నల్ రితిన్ మోహన్ అగర్వాల్, కాకినాడ శిక్షణ అధికారి కర్నల్ అనిల్ మెహ్రా, కమాండింగ్ ఆఫీసర్ 18 ఆంధ్ర బెటాలియన్ మేజర్ ఆసిఫ్‌ఖాన్, దేవాదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ కె.సుబ్బారావు, డీఈవో నాగేశ్వరరావు, ఈవో ఎం.ఎస్.ఎస్.శర్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

టి.నగర్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. పింఛన్లు, రేషన్ కార్డులు, ఇంటి స్థలాలకు సంబంధించి పలువురు సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డుల కోసం అర్జీలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం ఏకకాలంలో అమలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యర్రా శ్రీనివాసరావు, ముక్కామల సత్యనారాయణ, కాశీ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టెట్‌కు 422 మంది హాజరు

శ్యామలా సెంటర్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) మంగళవారం ప్రశాంతంగా జరిగింది. లూథర్‌గిరి ఐయాన్ డిజిటల్ కేంద్రంలో ఉదయం జరిగిన పరీక్షకు 240 మందికి గాను 223 మంది హాజరవ్వగా 17 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 240 మందికి గాను 199 మంది హాజరవ్వగా 41 మంది గైర్హాజరయ్యారని డీఎస్‌ఈ కె.వాసుదేవరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

దేవీచౌక్, న్యూస్‌టుడే: అత్యవసర మరమ్మతుల నిమిత్తం బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాను నిలిపివేయనున్నట్లు ఈఈ నక్కపల్లి శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు.

సమయం: ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు

ప్రాంతాలు: దానవాయిపేట, ప్రకాశంనగర్, బైపాస్‌రోడ్డు, నందం గనిరాజు సెంటర్

వేడుక.. అద్దెకు వేదిక

ఆనం కళాకేంద్రం వినియోగించుకోవచ్చు ఇలా..

న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ

సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరంలో ఆనం కళాకేంద్రానిది ప్రత్యేక గుర్తింపు. కళలకు నిలయమైన నగరంలో అనేక సాంస్కృతిక కార్యక్రమాలు ఈ వేదికగానే ప్రదర్శిస్తుంటారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వేదికను పలు కార్యక్రమాలకు అద్దెకు తీసుకోవచ్చు. అది ఎలా పొందాలంటే..

పలుమార్లు రాష్ట్రస్థాయి నంది నాటకోత్సవాలు, జాతీయ స్థాయి నాటక పోటీలకు ఆనం కళాకేంద్రం ఆతిథ్యం ఇచ్చింది. ప్రస్తుతం కళాకేంద్రాన్ని పూర్తి స్థాయి(సెంట్రల్) ఏసీ సదుపాయం కల్పించడంతోపాటు సీటింగ్ వ్యవస్థను మార్పు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఇతర కార్యక్రమాలకు అనుగుణంగా వినియోగించుకునే అవకాశం కల్పించారు. సుమారు వెయ్యి మంది సిట్టింగ్ సామర్థ్యం గల ఈ కేంద్రం ఇతర సాహిత్య వేదికలతోపాటు సన్మాన కార్యక్రమాలకు అద్దెకు పొందేందుకు అవకాశం ఉంది.



ఆనం కళాకేంద్రం

ఎవర్ని సంప్రదించాలంటే..

నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగంలో సంప్రదిస్తే వివరాలు తెలియజేస్తారు. ముందుగా వీటి కోసం కమిషనర్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తులో వివరాలు పరిశీలించి అనుమతి మంజూరు చేస్తారు.

రోజువారీ అద్దె ఎంతంటే..

✦ విద్యాలయాల సంబరాలు, ఇతర సమావేశాలకు కళాకేంద్రంను అద్దెకు ఇస్తున్నారు. అద్దె నిమిత్తం రూ.50 వేలు చెల్లించాల్సి ఉంటుంది. దీనికి విద్యుత్తు ఛార్జీలు అదనం. ✦ సాంస్కృతిక కార్యక్రమాలకైతే రూ.25 వేలకే అద్దెకిస్తున్నారు. రిజిస్ట్రేషన్ ఫారం కలిగిన కళా, సాహిత్య సంస్థలకు మాత్రమే ఈ అవకాశం అందిస్తున్నారు.

✦ కళాకేంద్రం పైన మినీ హాల్‌ను రూ.5 వేలకు అద్దెకు ఇస్తారు. వంద మందికి అనుకూలంగా ఉండే ఈ సమావేశ మందిరంలో నిర్వహించే అద్దెతోపాటు విద్యుత్తు ఛార్జీలు చెల్లించాలి. ✦ కళాకేంద్రం ఆవరణలోనూ వేదికలు ఏర్పాటు చేసుకోవచ్చు. దీనిలో భాగంగా సుబ్రహ్మణ్య మైదానంలో కళావేదికకు రూ.10 వేలు చెల్లించాల్సి ఉంటుంది.



ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాన్ని మృతుడి కుటుంబానికి అందిస్తున్న సంఘం సభ్యులు

సహచరుడి కుటుంబానికి రూ.1.40 లక్షల సాయం

వి.ఎల్.పురం: మృతుడి కుటుంబానికి రాజమహేంద్రవరం ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రూ.1.40 లక్షల ఆర్థిక సహాయం అందించింది. అసోసియేషన్ మాజీ ఆర్గనైజింగ్ కార్యదర్శి పిల్లి రాజేష్ ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు అసోసియేషన్ సభ్యులు నిర్ణయించారు. సంఘం తరఫున మృతుడి కుటుంబ సభ్యుల పేరిట మంగళవారం కోటిపల్లి బస్టాండ్ వద్దనున్న ప్రధాన తపాలా కార్యాలయంలో రూ.1.40 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినట్లు జిల్లా ఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కోనె శ్రీను, సంఘ నాయకులు రావులపాటి రావు, కేతా శ్రీను తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నగర విభాగం అధ్యక్షుడు సిరి శ్రీను, కార్యదర్శి లీలా నాగు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం

దేవీచౌక్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేయనున్నట్లు రాక్స్(రోర్ అగైనెస్ట్ కేటగిరైజేషన్ కాన్సిరసీ ఆఫ్ ఎస్సీస్) జాతీయ అధ్యక్షుడు ఆర్‌ఎస్ రత్నాకర్ వెల్లడించారు. రాజమహేంద్రవరంలోని ప్రెస్ క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యయుతంగా ఈ పోరాటం సాగుతుందన్నారు. త్వరలో పాదయాత్రలు చేస్తామన్నారు.

మముబ్రోవు మహాలక్ష్మి



మార్కండేయస్వామి ఆలయంలో అమ్మవారికి శ్రీమహాలక్ష్మి అలంకారం



జేఎన్ రోడ్డులో శ్రీస్వర్ణదుర్గ ఉత్సవాల్లో అమ్మవారు



ఏవీఏ రోడ్డు విజయ కనకదుర్గ ఆలయంలో అమ్మవారికి అలంకరణ



దేవీచౌక్‌లో అమ్మవారికి లలితా త్రిపుర సుందరీదేవి అలంకారం

రాజమహేంద్రవరం సాంస్కృతికం : నగరంలో దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శ్రీఉమా మార్కండేయస్వామి ఆలయంలో వేదికపై అమ్మవారి ఉత్సవ మూర్తిని మంగళవారం శ్రీమహాలక్ష్మిగా అలంకరించి కుంకుమార్చన జరిపించారు. శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి వట్టివేర్లతో అలంకరించారు. వంకాయలవారి వీధిలోని అష్టలక్ష్మీ ఆలయంలో లక్ష్మీనారాయణులకు విశేష అలంకారం, హారతి వేడుక నిర్వహించారు. ఏవీఏ రోడ్డులోని శ్రీవిజయ కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి సామూహిక పూజలు జరిపించారు. జేఎన్ రోడ్డులో శ్రీస్వర్ణదుర్గా నవరాత్రి మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు, హోమం జరిగాయి. బైపాస్ రోడ్డులోని కనకదుర్గమ్మ అమ్మవారిని కరెన్సీతో మహాలక్ష్మి అవతారంలో అలంకరించి పూజలు చేశారు. ❖ సీతంపేట మాతృరూపిణి సంస్థలో జగన్మాతకు 26 రకాల పిండి వంటలతో నైవేద్యం సమర్పించారు.



అష్టలక్ష్మీ ఆలయంలో లక్ష్మీనారాయణులకు విశేష పూజలు

❖ జేఎన్ రోడ్డులోని శివ కామేశ్వరీ పీఠంలో కుజ గ్రహ మండపారాధన ఆకట్టుకుంది.

దేవీచౌక్‌లో 'లలితా త్రిపుర సుందరీదేవి' దర్శనం

రాజమహేంద్రవరం సాంస్కృతికం : దేవీచౌక్‌లో మంగళవారం శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. కనకంబరాలతో జ్ఞాన బ్రహ్మచారిణి పూజ చేశారు. అమ్మవారి ప్రధానమూర్తికి కుంకుమార్చన నిర్వహించారు.

దేవీచౌక్‌లో నేడు

అలంకరణ: **సరస్వతీదేవి**

సాంస్కృతిక కార్యక్రమం: రాత్రి 10 గంటలకు మయసభ, సత్యహరిశ్చంద్ర, నాటకాల ప్రదర్శన

సోదరుడి అదృశ్యంపై ఫిర్యాదు

రాజమహేంద్రవరం నేరవార్తలు: సాయినగర్‌కు చెందిన కె.దుర్గాప్రసాద్(45) ఈ నెల ఆరో తేదీ నుంచి కనిపించడం లేదని అతని సోదరి పద్మావతి ప్రకాశంనగర్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కారు ఢీకొని గాయాలు

రాజేంద్రనగర్‌కు చెందిన పి.ప్రసాద్ సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై జైలు రోడ్డులో వెళ్తుండగా ఓ కారు ఢీకొంది. గాయపడిన అతను ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆ మేరకు ఆసుపత్రి వర్గాలు సమాచారంతో మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

వాహనం అదుపుతప్పి..

లాలాచెరువు హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన టి.ఆంజనేయులు మంగళవారం ఆటోనగర్ నుంచి గామన్ వంతెన వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అదుపుతప్పి విద్యుత్తు స్తంభాన్ని ఢీకొన్నారు. ఆ ప్రమాదంలో తలకు తీవ్రగాయం కావడంతో నగరంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆ మేరకు ఆసుపత్రి వర్గాలు బొమ్మూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

సారా కేసులో ఒకరి అరెస్టు

పిడింగొయ్యి ప్రాంతానికి చెందిన ఎం.తాతాలు నగరంలోని అంబేడ్కర్‌నగర్ వద్ద సారా విక్రయిస్తుండగా ఒక పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద పది లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

పోలవరం పనులు ప్రారంభించాలి

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు పనులు నవంబరు నుంచి ప్రారంభించాలని సూచిస్తూ అంతర్జాతీయ నిపుణుల కమిటీ నివేదిక ఇచ్చినందున దీనిని దృష్టిలో పెట్టుకుని కాఫర్ డ్యామ్, ప్రాజెక్టులో ఇతర పనులు త్వరితగతిన ప్రారంభించించాలని మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ డిమాండ్ చేశారు. మంగళవారం వి.ఎల్.పురంలోని నగర వైకాపా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక చేసింది ఏమీ లేదని విమర్శించారు. మద్యం దుకాణాల టెండర్లలో ఎమ్మెల్యేల జోక్యం వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోందన్నారు. ఉచిత ఇసుక ఎక్కడ దొరుకుతోందని ప్రశ్నించారు. మోరంపూడి పై వంతెనపై విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కంబాలచెరువు పార్కు నిర్వహణ సరిగా ఉండటం లేదన్నారు. తమ హయాంలో ఈ పార్కును అభివృద్ధి చేసి రూ.50 టికెట్ పెడితే.. అధికారంలోకి వచ్చిన తర్వాత తీసేస్తామని చెప్పిన ఎమ్మెల్యే శ్రీనివాస్ ఇప్పుడు ఎందుకు తీయలేదని ప్రశ్నించారు. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా తయారైందన్నారు.

వేళకు రాకుంటే ప్రయాణమెలా?

ఆర్టీసీ బస్సుల ఆలస్యంతో ఇబ్బందులు

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం



నాన్‌స్టాప్ కౌంటర్‌లోని సిబ్బందిని ప్రశ్నిస్తున్న ప్రయాణికులు

రాజమహేంద్రవరం-కాకినాడ నాన్‌స్టాప్ సర్వీసులతోపాటు ఉమ్మడి జిల్లా పరిధిలోని పలు మార్గాల్లో నడిచే కొన్ని ఆర్టీసీ బస్సులు ఆలస్యంగా నడవడంతో సమయానికి గమ్యస్థానాలకు చేరలేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కాకినాడ నాన్‌స్టాప్ బస్సులు మంగళవారం మధ్యాహ్నం సుమారు గంట ఆలస్యంగా రావడంతో రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నిరీక్షించలేక ప్రయాణికులు అసహనానికి గురయ్యారు.

రాజమహేంద్రవరం డిపో నుంచి కాకినాడకు తొమ్మిది బస్సులు, కాకినాడ డిపో నుంచి ఇక్కడికి తొమ్మిది బస్సులు నాన్‌స్టాప్ సర్వీసులుగా తిరుగుతున్నాయి. ప్రస్తుతం దసరా సీజన్ కావడంతో వీటికి డిమాండ్ మరింత పెరిగింది. ప్రతి అరగంటకొక బస్సు అందుబాటులో ఉండాల్సి ఉండగా గంటలకుపైగా ఆలస్యంగా బస్టాండ్‌కు సర్వీసులు వచ్చాయని, దీంతో నిరీక్షణ తప్పలేదని పలువురు ప్రయాణికులు తెలిపారు. వీటితోపాటు ఇక్కడి నుంచి కాకినాడ రూట్‌లో నడిచే పలు సర్వీసులు ఆలస్యంగా నడిచినట్లు చెబుతున్నారు. బస్సులు సకాలంలో అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై ఆర్టీసీ ఎస్‌ఎం త్రిమూర్తులును వివరణ కోరగా కాకినాడ రూట్‌లో రోడ్డు బాగోకపోవడం, కొన్నిచోట్ల ట్రాఫిక్ నిలిచిపోవడం కారణంగా మధ్యాహ్న సమయంలో కొన్ని బస్సులు కాస్త ఆలస్యం జరిగినట్లు చెప్పారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని జిల్లా రేషన్ డీలర్ల అసోసియేషన్ నాయకులు కోరారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన జిల్లా పౌరసరఫరాల అధికారి(డీఎస్‌వో) ప్రసాద్‌ను కలెక్టరేట్‌లోని ఆయన కార్యాలయంలో జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో పలువురు నాయకులు, రేషన్ డీలర్లు మర్యాదపూర్వకంగా మంగళవారం కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా రేషన్ల డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించినట్లు రేషన్ డీలర్ల సంఘ నాయకులు తెలిపారు.



డీఎస్‌వోకు సమస్యలు వివరిస్తున్న సంఘం నాయకులు

అన్నదానం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: పుష్కరఘాట్ వద్ద 'ఆకలితో ఉన్నవారికి ఆహారం' అనే ఆశయంతో వారం రోజులుగా లయన్స్ క్లబ్ రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో పేదలకు, యాత్రికులకు ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్నామని క్లబ్ అధ్యక్షుడు మద్దుల శ్రీరామ గుప్తా తెలిపారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు వెన్నా కుమారస్వామి, రాఘవరావు, గ్రంధి వసంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

అడుగు వేయాలంటే ఆందోళనే!

నగరంలోని పలు వీధుల్లో చిన్న మార్గాలు సమస్యలమయంగా మారాయి. ఈ మార్గాల్లో కాలువలపై ఇనుప గ్రిల్స్ సరిగా లేకపోవడం, ఫుట్‌పాత్, రోడ్డు మధ్యన విరిగిన చట్రాలు.. వాహన చోదకులు, పాదచారులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ప్రధాన ప్రాంతాల్లోనూ పలుచోట్ల ఇదే తీరు. కాలువలపై మూతలు సరిగా ఉండడం లేదు.

రాత్రి సమయంలో ఏమాత్రం ఏమరుపాటుగా అడుగు వేసినా ప్రమాదమే. నగరపాలక సంస్థ అధికారులు త్వరితగతిన స్పందించి పరిస్థితి చక్కదిద్దాలని నగరవాసులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు



తుమ్మలావ రైతు బజార్ వద్ద..



మున్సిపల్ పాఠశాల వద్ద ప్రమాదకరంగా..



28వ వార్డు సచివాలయం వద్ద..

మేమున్నాం.. మీకు తోడుగా

మీ ప్రాంతంలో ప్రజా సమస్యలు ఇబ్బంది పెడుతున్నాయా? ప్రభుత్వం నుంచి సక్రమంగా అందాల్సిన లబ్ధి మీకు చేరలేదా? ఇలా ఏ సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. చిత్రాలను, వివరాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

సమస్యలపై సంప్రదించాల్సిన నంబరు

80089 02897

83282 39927

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి


మొక్క అందిస్తున్న రైతు పెద్దసత్యనారాయణ

నర్సరీని సందర్శించిన ప్రత్యేక కలెక్టర్

కడియం: కడియపులంకలోని శ్రీసత్యదేవ నర్సరీని పోలవరం ప్రత్యేక కలెక్టర్ సరళావందనం మంగళవారం సందర్శించారు. కడియం తహసీల్దార్ పోసిబాబుతో ఆమెకు స్వాగతం పలకగా, నర్సరీ డైరెక్టర్ పుల్లా పెద్దసత్యనారాయణ మొక్క అందించారు. అనంతరం నర్సరీలోని పలు మొక్కలను ఆమె పరిశీలించారు. డిప్యూటీ తహసీల్దార్ మహాలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఊలపల్లిలో జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీ

బిక్కవోలు, న్యూస్‌టుడే: ఊలపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం నుంచి జిల్లాస్థాయి ఇన్విటేషనల్ హ్యాండ్‌బాల్ టోర్నమెంట్ నిర్వహిస్తామని ఊలపల్లి స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు తెలిపారు. వెటరన్ జాతీయ క్రీడాకారులైన చంటి, సాయి జ్ఞాపకార్థం పోటీలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఉత్తమ ఆరు జట్లను ఆహ్వానించి వాటి మధ్య పోటీలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. పోటీలను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వెల్లడించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమస్య: సీతానగరం శెట్టిబలిజపేటలోని పలు వీధుల్లో మురుగుకాలువల్లో పూడిక పేరుకుపోయింది. దుర్వాసనతో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. దోమలు విజృంభిస్తున్నాయి. **– కల్యాణ్, శెట్టిబలిజపేట**

సమాధానం: శెట్టిబలిజపేటలోని అన్ని వీధుల్లో పూడికతీత పనులు వెంటనే చేయిస్తాం. దోమలు పెరగకుండా మందు పిచికారీ చేస్తాం.
– ఎస్‌వీవీ సత్యనారాయణమూర్తి, కార్యదర్శి **– న్యూస్‌టుడే, సీతానగరం**



స్పందించారు.. పరిష్కరించారు

హుకుంపేట: పిడింగొయ్యి పంచాయతీ బాలకృష్ణనగర్ రహదారి చెంతనే చెత్తకుప్పలు పేరుకుపోయాయని, వాటికి నిప్పు పెట్టడంతో తీవ్ర ఇబ్బందిగా ఉందనే స్థానికుల ఫిర్యాదుమేరకు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు స్పందించారు. చెత్తకుప్పలను తొలగించి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేశారు. బ్లీచింగ్ పిచికారీ, చేసి రసాయనాలు వేశారు.

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ధవళేశ్వరం: **91212 29057**, కడియం: **91212 29062**, అనపర్తి: **91000 20947**

చోరీలతో భయాందోళన

● నేను రోజూ దినపత్రికలు ఇంటింటా పంపిణీ చేస్తాను. రోజూలానే కడియం వచ్చి పత్రికలు తీసుకుని ద్విచక్ర వాహనంపై పెట్టుకుని ముందుగా సాయిబాబా గుడికి వెళ్లాను. తిరిగి వచ్చేసరికి నా బండిలేదు. చోరీకి గురైందని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాను. **– ప్రసాద్, కడియపులంక**

● దుళ్లలోని నా మిత్రుడు ఇంటి ముందు గత ఆగస్టు 29న రాత్రి నా బైకు ఉంచాను. తెల్లవారుజామున 4 గంటల వరకు ఉంది. ఏడు గంటలకు లేచి చూస్తే కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాను. **– ఓ బాధితుడు, కడియం**

● కడియంలోని ఓ ప్రముఖ వ్యక్తి ఇంట్లో రెండేళ్ల కిందట 282 కాసుల బంగారు, వజ్రాభరణాలు చోరీకి గురయ్యాయని పోలీసులకు ఫిర్యాదు అందింది. దొంగల కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు ప్రారంభించినా ఇప్పటికీ వారి ఆచూకీ లభించలేదు.

● రాజమహేంద్రవరం గ్రామీణ నియోజకవర్గంలోని కాతేరు, మోరంపూడి, బొమ్మూరులోని ప్రశాంతి నగర్ తదితర ప్రాంతాల్లో రాత్రివేళల్లో చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

కడియం, న్యూస్‌టుడే: ఇంట్లోని విలువైన ఆభరణాలు, రూ.వేలు ఖర్చుచేసి కొనుగోలు చేసిన వాహనాలు చిటికెలో మాయమవుతున్నాయి. విలువైన ఆభరణాలు, వస్తువులు చోరీకి గురవుతున్న కేసులు అధికమయ్యాయని పలు గ్రామాలకు చెందిన స్థానికులు వాపోతున్నారు. కడియం మండలంలోని కడియం, కడియపులంక, వేమగిరి గ్రామాలు నిత్యం రద్దీగా ఉంటాయి. ముఖ్యంగా అంతర్రాష్ట్ర పూలమార్కెట్ కూడలిలో ద్విచక్ర వాహన చోరీలతో కొనుగోలుదారులు, పూలరైతులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డుపై వాహనం నిలిపి పూలు కొనుగోలు చేసి వచ్చేసరికి అది కనిపించడం లేదు. వాయిదాల పద్ధతిలో మనసుకు నచ్చిన వాహనాలు కొనుగోలు చేస్తే అవి చోరీకి గురయ్యాయనే వేదనతో పాటు వాయిదాలు చెల్లించాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


స్వాధీనం చేసుకున్న వాహనాలను పరిశీలిస్తున్న డీఎస్పీ భవ్యకిశోర్

పోలీసు గస్తీ పెంచాలంటున్న గ్రామస్థులు

శాటిలైట్ సిటీ, ధవళేశ్వరం, బొమ్మూరు తదితర ప్రాంతాల్లోని శివారు ప్రాంతాల వరకు రాత్రి వేళల్లో పోలీసు గస్తీ పెంచాలని గ్రామస్థులు కోరుతున్నారు. సిబ్బందిని అప్రమత్తం చేయడం, ఆయా ప్రాంతాలను పర్యవేక్షించడంపై ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అలా చేస్తేనే చోరీలకు అడ్డుకట్ట వేయవచ్చని చెబుతున్నారు.

నేరాల వివరాలు..

పోలీసు స్టేషను	మొత్తం	పరిష్కరించినవి	పెండింగ్
కడియం	25	16	9
ధవళేశ్వరం	25	12	13

ఎల్‌హెచ్‌ఎంఎస్ సద్వినియోగంతో..

పండగలు, ప్రత్యేక సందర్భాల్లో ఇంటికి తాళం వేసి వేరే ప్రాంతాలకు వెళ్లేవారంతా లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్‌ఎంఎస్) సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఇది అన్ని పోలీసుస్టేషన్లలో ఉంది. మీ వివరాలు, ప్రయాణ తేదీలను సంబంధిత పోలీసుస్టేషన్లలో అందిస్తే ఆయా ఇళ్లపై పోలీసు నిఘాను ఏర్పాటుచేస్తాం. ఆయా ప్రాంతాలు, ఇళ్లు నిఘా కెమెరాల పరిధిలోకి తీసుకుంటాం. దీంతో నేరాలు జరిగేందుకు ఆస్కారం ఉండదు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ సదుపాయంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. ఇటీవల కడియం పోలీసుస్టేషన్ పరిధిలో నలుగురు బాలలను అదుపులోకి తీసుకుని వారి నుంచి పది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నాం. పెండింగ్ చోరీ కేసులపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నాం.
– భవ్యకిశోర్, దక్షిణ మండల డీఎస్పీ, రాజమహేంద్రవరం

జీవ వైవిధ్య మండలి సమావేశం

రాజానగరం, న్యూస్‌టుడే: మండలంలోని పుణ్యక్షేత్రంలో జీవ వైవిధ్య మండలి ఆధ్వర్యంలో మంగళవారం వన్యప్రాణి సప్తాహం నిర్వహించారు. సుదూర ప్రాంతమైన సైబీరియా నుంచి వలసపక్షులు పుణ్యక్షేత్రానికి రావడంపై చర్చించారు. పక్షుల ప్రేమికుడు ఎస్.ఎస్.భగవాన్‌దాస్ ఆయా పక్షుల వివరాలు వివరించారు. కార్యక్రమంలో సర్పంచి వెంకటేశ్వరరావు, అటవీ శాఖ ఎఫ్‌బీఓ రంగబాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

రంగంపేట, న్యూస్‌టుడే: మండల పరిషత్తు కార్యాలయంలో ప్రజాప్రతినిధులకు నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. జడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, ఎంపీడీవో వి.వి.సాయిబాబు, ఈవోపీఆర్డీ పి.వెంకటరత్నం ప్రజాప్రతినిధులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు.

వ్యవసాయ క్షేత్ర సందర్శన

రంగంపేట, న్యూస్‌టుడే: రంగంపేటకు చెందిన రైతు పోతుల పద్మారావు వ్యవసాయ క్షేత్రాన్ని మంగళవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు సందర్శించారు. నల్లని నూతన వరి వంగడం బీపీటీ-2841 సాగులో లాభనష్టాలపై రైతుతో ఏరువాక శాస్త్రవేత్తలు నరసింహారావు, ఎం.శ్రీనివాస్ చర్చించారు. ఈ రకానికి అధిక ధర లభిస్తుందని చెప్పారు. ముకుందవరంలో వ్యవసాయధికారి కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది.

పురుషోత్తపట్నంలో ప్రత్యేక రెవెన్యూ గ్రామసభలు

ఈనాడు కథనానికి స్పందన

సీతానగరం, న్యూస్‌టుడే: భూముల రీసర్వేలో సాంకేతిక తప్పిదాలను సరిచేసేందుకు బుధవారం గ్రామసభలు నిర్వహిస్తామని తహసీల్దారు అంకం శ్రీనివాసు తెలిపారు. మండలంలోని పురుషోత్తపట్నం, రామచంద్రపురం గ్రామాల్లో రీసర్వేలతో ఎదురవుతున్న ఇబ్బందులపై రైతుల ఆవేదనను వివరిస్తూ ‘ఉన్న భూమి మాయం.. లేని ఖాతాల్లో ప్రత్యక్షం’ శీర్షికన ‘ఈనాడు’లో ప్రచురించిన కథనంపై కలెక్టర్ స్పందించారు. రీసర్వే చేసిన ఆ రెండు గ్రామాల్లో ప్రత్యేక రెవెన్యూ గ్రామసభలు ఏర్పాటుచేయాలనే ఆదేశించారు. ఈ మేరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు గ్రామసభలు నిర్వహిస్తామని తహసీల్దారు తెలిపారు. రీసర్వే ప్రత్యేక డీటీ సర్వేశ్వరమూర్తి ఆధ్వర్యంలో నలుగురు వీఆర్వోలు, నలుగురు సర్వేయర్లు రైతుల నుంచి వినతులు స్వీకరించి సమస్యలను పరిష్కరించేలా నివేదికలు సిద్ధం చేస్తారన్నారు.

ఎమ్మెల్యేతో అధికారుల భేటీ

కోరుకొండ: కోరుకొండ జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణను పలువురు అధికారులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన అశోక్‌కుమార్, సూపరింటెండెంట్ శామ్యూల్, మహిళా శక్తి సంఘాల ఏపీఎం సూరమ్మ ఎమ్మెల్యేని కలిశారు. ఈ సందర్భంగా పెండింగ్ పనులు పూర్తిచేయాలని, అభివృద్ధి కార్యక్రమాలకు నివేదికలు తయారుచేయాలని ఎమ్మెల్యే వారికి సూచించారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల

ప్రపంచంలో మనది విశ్వగురువు స్థానం


డిజిటల్‌కార్డు అందిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం విశ్వగురు స్థానాన్ని సాధించిందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చెప్పారు. అనపర్తిలో మంగళవారం భాజపా ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొన్నారు. కూటమి నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లిన ఎమ్మెల్యే పలువురితో భాజపా సభ్యత్వ నమోదు చేయించారు. గత నెలలో ప్రారంభమైన నమోదులో 14,800 మందిని సభ్యులుగా చేరారని వివరించారు. కార్యక్రమంలో భాజపా నియోజకవర్గం కన్వీనర్ శివరామకృష్ణంరాజు, కూటమి నాయకులు తమలంపూడి సుధాకర్‌రెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కర్రి బుల్లిరెడ్డి, వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

చీటీల సంప్రదాయానికి చెల్లు..

బిక్కవోలు: మండల సర్వసభ్య సమావేశాల్లో సభ్యులు, సర్పంచులు తమ సమస్యలను చీటీలపై రాసి ఇచ్చే సంప్రదాయానికి స్వస్తి పలికినట్లు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం బిక్కవోలు మండల పరిషత్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఎలాంటి సమస్యనైనా నేరుగా తనతో, అధికారులతో చెప్పవచ్చని సూచించారు. కొమరిపాలెం సర్పంచి రవికుమార్ మాట్లాడుతూ తొస్సిపూడి సెంటరులో స్థలం ఆక్రమించి దుకాణాలు ఏర్పాటుచేశారని కొనుగోలుదారులు సైకిళ్లు, వాహనాలు అడ్డుగా పెట్టి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్నారని ఫిర్యాదుచేశారు. ఇన్‌ఛార్జి ఎంపీపీ కన్నారావు మాట్లాడుతూ కాకినాడ-రాజమహేంద్రవరం రోడ్డు అధ్వానంగా ఉందని, మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే సమాధానం ఇస్తూ నిధులు మంజూరయ్యాయని త్వరలోనే పనులు ప్రారంభిస్తారని చెప్పారు. మధ్యాహ్న భోజనంపై ఫిర్యాదులు రావడంతో ఎమ్మెల్యే ఎంఈవోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో ఇన్‌ఛార్జి ఎంపీడీవో రత్నకుమార్, తహసీల్దారు రమణి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు ప్రేమాభిమానాలు


వృద్ధ మహిళలతో ఎన్‌సీసీ క్యాడెట్లు

రాజానగరం, న్యూస్‌టుడే: ఎన్‌సీసీ ప్రత్యేక జాతీయ సమైక్యత శిబిరంలో భాగంగా గైట్ ఇంజినీరింగ్ కళాశాల క్యాడెట్లు మంగళవారం వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వృద్ధులను ఆప్యాయంగా పలుకరించి వారికి అనురాగాలు పంచారు. వారి కుటుంబ సభ్యుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆహార పదార్థాలను వడ్డించి తినిపించారు. భావోద్వేగానికి గురైన వారి కన్నీరు తుడిచి అక్కున చేర్చుకుని దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ చర్యలతో వృద్ధులు ఆనందపరవశులయ్యారని క్యాంప్ డిప్యూటీ కమాండర్, మేజర్ ఆసిఫ్ సాహెబ్ తెలిపారు. అనంతరం క్రీడా పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కాకినాడ గ్రూప్ కమాండర్ కర్నల్ రితిన్ మోహన్ అగర్వాల్, కాకినాడ శిక్షణ అధికారి కర్నల్ అనిల్ మెహ్రా, కమాండింగ్ ఆఫీసర్ 18 ఆంధ్ర బెటాలియన్ మేజర్ ఆసిఫ్‌ఖాన్, దేవాదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ కె.సుబ్బారావు, డీఈవో నాగేశ్వరరావు, ఈవో ఎం.ఎస్.ఎస్.శర్మ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ.. భక్తుల కల్పవల్లిగా..

గోకవరం: గోకవరం దేవీచౌక్ దుర్గాదేవి అమ్మవారు మంగళవారం మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాసశర్మల ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో అమ్మవారికి 108 రకాల పిండి వంటలను నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజలు జరిపారు.

రాజానగరం: చక్రద్వారబంధంలోని దేవీచౌక్ కనకదుర్గమ్మకి గ్రామానికి చెందిన ప్రగడ మునీశ్వరరావు, ధనలక్ష్మి దంపతులు బంగారు శతమానాలు సమర్పించారని అర్చకులు భవానీభట్ల శ్రీకాంత్‌శర్మ తెలిపారు. దేవీ నవరాత్రుల్లో అమ్మవారికి అలంకరించి ప్రత్యేకపూజలు చేస్తున్నట్లు వివరించారు.

కడియం: కడియపులంక శ్రీహరిహర మహాక్షేత్రంలోని శ్రీఅపర్ణా సమేత అనంతేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం అమ్మవారు శ్రీమహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. కరెన్సీ నోట్ల దండలతో అమ్మవారిని అలంకరించారు.

బొమ్మూరు: బొమ్మూరు నేతాజీనగర్ కనకదుర్గమ్మ గుడిలో అమ్మవారిని లలితాదేవిగా అలంకరణ చేశారు. భక్తులు సమర్పించిన చీరను అలంకరించారు. నైవేద్యాలు, పుష్పాలతో విశేష పూజలు చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఉత్సమూర్తి వద్ద కుంకుమ పూజలు నిర్వహించారు. మూలమూర్తికి ధూపసేవ, వివిధ హారతులు సమర్పించారు.

బిక్కవోలు: బలభద్రపురంలోని శిర్డీసాయి మందిరంలో శత చండీయాగంలో భాగంగా మంగళవారం నిర్వహించిన కుంకుమ పూజలకు పెద్దఎత్తున మహిళలు హాజరయ్యారు. అనంతరం బ్రాహ్మణ మహిళను దుర్గామాతగా భావించి సువాసినీ పూజ నిర్వహించారు.


అమ్మవారికి శతమానాలు సమర్పిస్తున్న మునీశ్వరరావు దంపతులు


గోకవరం దేవీచౌక్ దుర్గాదేవి అమ్మవారికి 108 రకాల పిండి వంటలతో నైవేద్యం

దుర్గాదేవిని దర్శించుకున్న ఎమ్మెల్యే..

ఆర్.ఎస్.పేటలోని రాజరాజేశ్వరి అమ్మవారిని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. పందలపాకలోని అయ్యప్పస్వామి, సంతోషిమాత ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

హుకుంపేట: శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా ఆరో రోజు మంగళవారం పిడింగొయ్యి పంచాయతీ వెంకటగిరి హరిహరక్షేత్రంలోని అమ్మవారి మహాలక్ష్మిగా అలంకరించారు. వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థులు ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజలుచేశారు.


కడియపులంకలో శ్రీమహాలక్ష్మిగా దర్శనమిస్తున్న శ్రీఅపర్ణాదేవి


వెంకటగిరిలో మహాలక్ష్మిగా..


బొమ్మూరులో లలితాదేవి

పాఠశాల సముదాయాలకు జవసత్వాలు

అనపర్తి పట్టణం, బిక్కవోలు, న్యూస్‌టుడే: పాఠశాల సముదాయాలు ఇకపై మరింత మెరుగ్గా మారనున్నాయి. దీనిలో భాగంగా ప్రస్తుతం ఉన్నవాటిని కుదించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. పాఠశాల సముదాయాల పునర్వ్యవస్థీకరణ పనులు పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ ఆధ్వర్యంలో చురుగ్గా సాగుతున్నాయి. వీటికి జవసత్వాలు కల్పించేందుకని ప్రభుత్వం చెబుతున్నా సీఆర్‌ఎంటీలు (క్లస్టర్ రిసోర్సు మొబైల్ టీచర్) తమ ఉద్యోగానికి ముప్పు వాటిల్లుతుందని ఆందోళన చెందుతున్నారు. పునర్వ్యవస్థీకరణతో తగ్గనున్న క్లస్టర్ సెంటర్లతో వీరిలో ఉద్యోగ అభద్రతాభావం పెరుగుతోంది. వీరంతా 2012 సంవత్సరంలో విధుల్లో చేరారు. ప్రతి మండలాన్ని రెండు, మూడు క్లస్టర్లుగా విభజించి ఒక్కో క్లస్టరుకు వీరిని పరిశీలకులుగా ప్రభుత్వం నియమించింది. విద్యాబోధనతో పాటు విద్యా సంబంధిత అంశాలు క్లస్టర్లలో ఎలా అమలవుతున్నాయో పరిశీలించడమే పని. గత ప్రభుత్వ హయాంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు పెరిగిపోయాయి. మూడు, నాలుగు, అయిదు తరగతుల విద్యార్థుల్ని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడంతో ప్రాథమిక స్థాయిలో ఒకటి, రెండు తరగతులే మిగిలాయి. దీంతో చాలా బడులు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారాయి. ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయుడు సెలవు పెడితే పాఠశాలను మూసివేయకుండా సీఆర్‌ఎంటీలు ఆ రోజుకు తరగతులు బోధించేలా అప్పట్లో ఉత్తర్వులు ఇచ్చారు.


ఏకోపాధ్యాయ పాఠశాలలో బోధిస్తున్న సీఆర్‌ఎంటీ

జిల్లాలో 81 సముదాయాలు

ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లాలో 81 పాఠశాలల సముదాయాలు ఉన్నాయి. వీటిని 78 లేదా 79కి కుదించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. మిగిలిన సీఆర్‌ఎంటీలను ఎక్కడికి పంపుతారనే ప్రశ్న తలెత్తుతోంది. జిల్లాలో రెండు నుంచి మూడు తగ్గినా కొన్ని జిల్లాల్లో 6 నుంచి 7 క్లస్టర్లు తగ్గిపోతున్నాయి. ఈ కారణంగా ఆందోళన నెలకొంది. ప్రస్తుతం జిల్లాలో 93 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉండగా ప్రభుత్వం 3, 4, 5 తరగతులను మళ్లీ ప్రాథమిక పాఠశాలలకు బదిలీ చేయనున్న నేపథ్యంలో ఏకోపాధ్యాయ పాఠశాలల సంఖ్య గణనీయంగా తగ్గనుంది.

మరింత మెరుగ్గా నిర్వహించేందుకే..

పాఠశాలల సముదాయాలను మరింత మెరుగ్గా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఎవరికీ ఉద్యోగ అభద్రత కలగదు. ఎవరి విధులు వారు నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం. పాఠశాల సముదాయం ఏర్పాటుచేస్తే అక్కడ అన్ని సదుపాయాలు ఉండాలి. సమావేశాలు, కార్యక్రమాల నిర్వహణకు సౌకర్యంగా ఉండాలి. రోడ్డు, బస్సుల రాకపోకలతో పాటు భవిష్యత్తులో ఏవైనా నిర్మాణాలు చేయలన్నా అనుకూలంగా ఉన్నవాటినే ఎంపికచేస్తారు. దీనిపై అన్ని వివరాలు ప్రభుత్వానికి నివేదించాము. సీఆర్‌ఎంటీల ఉద్యోగాలకు ఎలాంటి ఇబ్బంది లేదు.
- వాసుదేవరావు, జిల్లా విద్యాశాఖ అధికారి

భాజపా సభ్యత్వ నమోదు

ధవళేశ్వరం: భాజపా సభ్యత్వ నమోదును యువమోర్చా ఆధ్వర్యంలో బస్టాండు సెంటర్‌లో షేక్ సాజిద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో భాజపా నాయకులు గుర్రాల వెంకటరావు, కందుకూరి మనోజ్ బాబు, యానాపు ఏసు, ఆచారి, సుబ్రహ్మణ్యం, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.


ధవళేశ్వరంలో సభ్యత్వ నమోదులో పాల్గొన్న నాయకులు

‘జనసేన పార్టీలో చేరలేదు..’

అనపర్తి గ్రామీణం: అనపర్తి మండలం పీరారామచంద్రపురం గ్రామంలోని వైకాపా నేత నల్లమిల్లి మణికంఠరెడ్డికి జనసేన పార్టీతో ఎలాంటి సంబంధం లేదని జనసేన మండల కమిటీ నాయకులు తెలిపారు. జనసేన పార్టీ కండువా వేసుకుని పార్టీ ముఖ్యనేతలతో కలిసి సామాజిక మాధ్యమాల్లో మణికంఠరెడ్డి విడుదల చేసిన చిత్రాలను ఖండిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గం కన్వీనర్ మర్రెడ్డి శ్రీనివాసరావు, రావాడ నాగు ఆధ్వర్యంలోనే చేరికలు జరుగుతున్నాయని వివరించారు. మండల జనసేన అధ్యక్షుడు ఎన్‌ఆర్‌కే ప్రసాద్‌రెడ్డి, టౌన్ అధ్యక్షుడు నల్లమిల్లి నాగిరెడ్డి, నాయకులు ర్యాలీ చంటి, ఇంటి గణేష్, కె.శ్రీను, శివ తదితరులు పాల్గొన్నారు.

చోరీకి గురైన ద్విచక్ర వాహనం స్వాధీనం

తాళ్లపూడి, న్యూస్‌టుడే: చోరీకి గురైన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని, ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. వివరాల ప్రకారం. కడియం మండలం పొట్టిలంకకు చెందిన కొత్తపల్లి నారాయణ ఈనెల 5న ద్విచక్ర వాహనంపై తాళ్లపూడి బజారుకు వచ్చారు. అక్కడ వాహనం నిలిపి అల్పాహారం తిని తిరిగి వచ్చేసరికి వాహనం కనిపించలేదు. దీనిపై నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మంగళవారం ద్విచక్ర వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా కొవ్వూరు మండలం పెనకనమెట్టకు చెందిన ఆనందేల్లి వీర్రాజు అపహరణకు గురైన ద్విచక్రవాహనంపై వస్తుండగా గుర్తించి అరెస్టు చేసి, వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వాహనం అదుపుతప్పి గాయాలు

రాజమహేంద్రవరం నేరవార్తలు: లాలాచెరువు హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన టి.ఆంజనేయులు మంగళవారం ఆటోనగర్ నుంచి గామన్ వంతెన వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అదుపుతప్పి విద్యుత్తు స్తంభాన్ని ఢీకొన్నారు. ఆ ప్రమాదంలో తలకు తీవ్రగాయం కావడంతో నగరంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆ మేరకు ఆసుపత్రి వర్గాలు బొమ్మూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

సారా కేసులో ఒకరి అరెస్టు

పిడింగొయ్యి ప్రాంతానికి చెందిన ఎం.తాతాలు నగరంలోని అంబేడ్కర్‌నగర్ వద్ద సారా విక్రయిస్తుండగా ఒక పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద పది లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

అనపర్తి గ్రామీణం: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని అనపర్తి ఎస్సై శ్రీనునాయక్ హెచ్చరించారు. అనపర్తిలో సోమవారం రాత్రి అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న ఆయన మంగళవారం తహసీల్దారు అనిల్ సమక్షంలో బైండోవర్ చేశారు. రాత్రి సమయంలో అకారణంగా, అనుమానాస్పదంగా తిరిగితే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని స్థానికులను కోరారు.

ఇద్దరు దొంగల అరెస్టు

రాజానగరం, న్యూస్‌టుడే: రాజానగరంతో పాటు పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్న ఏడు కేసుల్లో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశామని సీఐ ఎస్.పి.వీరయ్యగౌడ్ తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో కేసుల వివరాలు వివరించారు. రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొంతమూరులో గత నెల 21న బచ్చుల గంగ బంధువుల ఇంటికి వెళ్లి 24న తిరిగి వచ్చేసరికి తలుపులు పగులగొట్టి, బీరువాలోని బంగారు, వెండి ఆభరణాలను దొంగలు దోచుకున్నారు. ఈ కేసులో ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. వారిద్దరూ మరిన్ని నేరాలు చేసినట్లు వెల్లడైంది. రాజానగరంతో పాటు బొమ్మూరు, కోరుకొండ, గోకవరం పోలీస్‌స్టేషన్ల పరిధిలో పలు నేరాలకు పాల్పడగా ఆయా కేసుల్లో వారు దోచుకున్న సొత్తును స్వాధీనం చేసుకున్నారు. మొత్తం ఏడు కేసుల్లో 20 గ్రాముల బంగారం, రెండు కేజీల వెండి, రూ.20 వేల నగదు, రెండు మోటారు సైకిళ్లు, కారు, టీవీని స్వాధీనం చేసుకున్నామని సీఐ వీరయ్యగౌడ్ తెలిపారు.


స్వాధీనం చేసుకున్న ఆభరణాలు, నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ వీరయ్యగౌడ్

తక్కువ పెట్టుబడితో లాభసాటి సాగు

పెదపూడి, న్యూస్‌టుడే: తక్కువ పెట్టుబడితో లాభసాటి వ్యవసాయం చేయాలని వ్యవసాయ శాఖ కాకినాడ జిల్లా సంయుక్త సంచాలకులు ఎన్.విజయ్‌కుమార్ సూచించారు. మంగళవారం పెదపూడిలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా ఆయన రైతులకు సూచనలిచ్చారు. పెట్టుబడులు తగ్గించేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి డ్రోన్‌ల ద్వారా పురుగుమందులు, జీవ ఎరువులు పిచికారీ చేయాలన్నారు. సమగ్ర వ్యవసాయ విధానంలో ఎకరా పొలంలో వివిధ రకాల పంటలు పండించవచ్చన్నారు. అందులోనే చేపలు, కోళ్లు పెంచుతూ కూరగాయల పంటలు సాగు చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి టి.వి.ఆర్.మణిదీప్, కూటమి నేతలు పుట్టా గంగాధర చౌదరి, ఆరుమిల్లి అమ్మన్న చౌదరి, ఎ.వాసు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.


రైతులకు సూచనలిస్తున్న సంయుక్త సంచాలకుడు ఎన్.విజయ్‌కుమార్

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం



పూజల్లో పాల్గొన్న భక్తులు

కోటసత్తెమ్మకు ప్రత్యేక పూజలు

నిడదవోలు: తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయంలో సహస్రనామ కుంకుమపూజల్లో 329 మంది దంపతులు పాల్గొన్నారు. అమ్మవారికి వివిధ రూపాల్లో రూ.2,00723ల ఆదాయం వచ్చింది. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు హైదరాబాద్‌కు చెందిన దేవుళ్ల వీరవెంకట రామకిషోర్-సంధ్య దంపతులు చక్కెరపొంగలి ప్రసాదాన్ని అందించారు. ఆలయ సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త దేవులపల్లి రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా తయారీ కేంద్రాల పరిశీలన

ఉండ్రాజవరం: బాణసంచా తయారీ కేంద్రాల్లో నిబంధనలు విధిగా పాటించాలని తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాదు అన్నారు. దీపావళిని పురస్కరించుకుని మండలంలోని సూర్యారావుపాలెం, వడ్లూరు, తాడిపర్రు తదితర గ్రామాల్లో బాణసంచా తయారీ కేంద్రాలను అధికారులు బృందంగా మంగళవారం పరిశీలించారు. తయారీదారులకు నిబంధనలు వివరించారు.

పెరవలిలో భారీ వర్షం

పెరవలి, న్యూస్‌టుడే: పెరవలి మండలంలో మంగళవారం భారీవర్షం కురిసింది. ఖండవల్లిలో బీసీ ఏరియా, తీపర్రు, కాకరపర్రు, అజ్జరం, పిట్టలవేమవరం, మల్లేశ్వరం తదితర గ్రామాలలో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రాకపోకలకు విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల రహదారులపై నీరు నిలిచిపోయింది.



దేవరపల్లిలో నగదు అలంకరణలో బాలదుర్గమ్మ



దేవరపల్లి: కలశాలతో మహిళల గ్రామోత్సవం

జయ రూపిణి.. అభయ ప్రదాయిని



పెరవలి మండలం ముక్కామలలో రూ.11 లక్షల నగదు నోట్లతో...

న్యూస్‌టుడే, బృందం: దేవి శరన్నవరాత్రులను పురస్కరించుకుని ఆరో రోజు మంగళవారం అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ★ దేవరపల్లిలోని మూడు బొమ్మల సెంటర్‌లో కొలువైన శ్రీ సౌభాగ్య దుర్గాంబిక ఆలయం వద్ద మహిళలు గోదావరి జల కలశాలతో గ్రామోత్సవం నిర్వహించారు. శ్రీబాలదుర్గమ్మను రూ.1.5 లక్షల విలువైన నోట్లతో అలంకరించారు. ఆలయంలో 42 కేజీల లడ్డూను రూ.9,300 పానీపూరి జిత్తు అనే భక్తుడు పాడుకున్నారు. ★ తాళ్లపూడిలో నవదుర్గాదేవిని రూ.10 లక్షల విలువైన నోట్లతో అలంకరించారు. ఆలయప్రాంగణంలో పల్లకిసేవ జరిగింది. మలకపల్లిలో కనకదుర్గాదేవి, తాళ్లపూడిలో రాజ్యలక్ష్మీదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేగేశ్వరపురం, పెద్దేవం, అన్నదేవరపేట, తాడిపూడి, గజ్జరం తదితర గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి ప్రతిమల వద్ద భక్తులు భజనలు చేశారు. ★ ఆవపాడులోని దుర్గమ్మ ఆలయంలో ఏర్పాటు చేసిన అఖండ జ్యోతిని జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి, ఆ గ్రామ సర్పంచి అచ్యుత సత్యనారాయణ పూజలు నిర్వహించి వెలిగించారు. ★ మోర్తలో విజయకనకదుర్గమ్మ ఆలయం వద్ద సామూహిక కుంకుమ పూజలు భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ★ పెరవలి మండలం ముక్కామలలోని వేంద్రావారి వీధిలో రూ.11 లక్షల విలువైన నోట్లతో అమ్మవారిని అలంకరించారు. అమ్మవారి ఉత్సవాలు ప్రారంభించి ఈ ఏడాదితో 25 సంవత్సరాలు అయిందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.



నిడదవోలు: చింతచెట్టువీధిలో..



కాల్దరిలో...



సూర్యారావుపాలెంలో...

అసంపూర్తిగా గోదాములు

నిల్వ సౌకర్యం లేక రైతుల ఇక్కట్లు

చాగల్లు, న్యూస్‌టుడే

ఆరుగాలం శ్రమించి పండించిన పంట ఉత్పత్తులను ప్రకృతి వైపరీత్యాల నుంచి సంరక్షించుకోవడం కొవ్వూరు ప్రాంత రైతులకు తలకుమించిన భారంగా మారుతోంది. ఈ పరిస్థితుల్లో వారిని ఆదుకునేందుకు మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో కొవ్వూరు మండలం కాపవరంలో చేపట్టిన రెండు భారీ గోదాముల్లో ఒకటి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ పూర్తి కాలేదు. వీటి నిర్మాణానికి 2007-08లో రూ.11.40 లక్షలు వెచ్చించి 5.52 ఎకరాల స్థలం కొనుగోలు చేశారు. 2014లో గోదాముల నిర్మాణానికి రూ. 1.05 కోట్లు, కార్యాలయ భవనానికి రూ.12 లక్షలు, ప్రహరీకి రూ.64 లక్షలు, విద్యుత్తు దీపాలు తదితరాల ఏర్పాట్లకు రూ.3 లక్షలు చొప్పున సుమారు రూ.2 కోట్లు కేటాయించారు. సుమారు 1,600, 2000 మెట్రిక్ టన్నుల సామర్థ్యంగల రెండు గోదాముల నిర్మాణం లక్ష్యం కాగా వీటిలో 1600 మెట్రిక్ టన్నుల సామర్థ్యంగల గోదాము నిర్మాణం గతంలోనే పూర్తయింది. 2 వేల మెట్రిక్ టన్నుల గోదాము నిర్మాణం ఇప్పటికీ అసంపూర్తిగానే ఉంది. ఆవరణలో 40 నుంచి 50 మందికి పైగా రైతులు తమ ఉత్పత్తులను విక్రయించుకొనే వీలుగా యార్డు నిర్మాణం ఇంకా చేపట్టాల్సి ఉంది.



అసంపూర్తిగా 2000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాము



ధాన్యం లోపల... ప్రయాణికులు బయట... దొమ్మేరు బస్టాండు పరిస్థితి ఇది (పాత చిత్రం)

నిధులున్నట్లా? లేనట్లా..?

2 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంగల గోదాముకు 2019-20లో రూ.1.20 కోట్లు విడుదల చేశారు. ఇందులో ఇప్పటి వరకు రూ.57.74 లక్షలతో పనులు చేపట్టినట్లు అధికారులు చెబుతున్నారు. మిగిలిన సొమ్ముతో నిర్మాణం పూర్తిచేయాల్సి ఉన్నా గోదాము రూఫింగ్ ఏర్పాటులో నూతన సాంకేతికత అంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఈ రూఫింగ్ సామగ్రి ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి ఉందని చెబుతున్నారు. ఇందుకు అవసరమైన నిధులు ఉన్నాయా? లేవా? అనే సందేహాలతో పాటు ఆలోగా పూర్తయిన నిర్మాణం దెబ్బతినే ప్రమాదముందని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. గోదాము గోడలు బీటలు వారాయి. రాత్రి వేళ అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

విలువైన స్థలంపై అక్రమార్కుల కన్ను..

ఏళ్ల తరబడి ఐదున్నర ఎకరాల భూమి నిరుపయోగంగా ఉండడంతో అక్రమార్కుల కన్ను పడినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికే ఆక్రమణకు ప్రయత్నాలు జరగడమే కాక భూమిలో కొంత భాగాన్ని విక్రయానికి ఉంచినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు పూర్తిస్థాయిలో అప్రమత్తం కాకపోతే కోట్ల రూపాయల భూమి అక్రమార్కుల పాలయ్యే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, అధికారులు దృష్టి సారిస్తే అక్రమాలకు అడ్డుకట్ట పడడంతోపాటు నిర్మాణం పూర్తి చేస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని పలువురు అంటున్నారు.



నిర్మాణం పూర్తయినా నిరుపయోగంగా 1600 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాము

కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

నిడదవోలు, న్యూస్‌టుడే: మొబైల్ రంగం సామ్‌సంగ్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జాతీయ కమిటీ పిలుపు మేరకు మంగళవారం నిడదవోలు రైల్వేస్టేషన్ కూడలిలో ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందర్‌బాబు మాట్లాడుతూ తమిళనాడులోని పెరంబదూర్ ప్రాంతంలోని సామ్‌సంగ్ పరిశ్రమలో గత నెల రోజులుగా 1,500 మంది కార్మికులు నిత్యావసర సరకుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరుతూ సమ్మె చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి కేవీఎస్ రామచంద్రరావు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు, సీఐటీయూ మండల అధ్యక్షుడు గంటి కృష్ణ, లైట్ మోటార్ డ్రైవర్స్ యూనియన్ కార్యదర్శి మీరియాల దసరాజు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు



వరి పంటపై రైతులకు సూచనలు ఇస్తున్న అధికారులు

జీపీఎస్ కలిగిన వాహనాల్లోనే ధాన్యం తరలింపు

తాళ్లపూడి, గోపాలపురం, న్యూస్‌టుడే: ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో జీపీఎస్ కలిగిన వాహనాల్లోనే ధాన్యం తరలించాలని తహసీల్దార్ రవిప్రసాద్ తెలిపారు. తాళ్లపూడి మండలంలోని తిరుగుడుమెట్టలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. తాళ్లపూడి మండల వ్యవసాయాధికారిణి రుచిత మాట్లాడుతూ ప్రభుత్వం దగ్గరలో ఉన్న రైసుమిల్లులకు తరలించే అవకాశం కల్పించిందన్నారు. విరిగిన గోనె సంచులు లేకుండా మంచి సంచులు అందిస్తామన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఇబ్బందులు ఎదురైతే ఉద్యోగుల దృష్టికి తేవాలన్నారు. సీఎస్‌డీటీ దివాకర్, రైతులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. ★ గోపాలపురం మండలంలోని గుడ్డిగూడెం, సంజీవపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో మండల వ్యవసాయ, ఉద్యాన అధికారులు బి.రాజారావు, రమేష్ మాట్లాడారు. రైతులు పండించే పంటలపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం క్షేత్రస్థాయిలో పొలాలను పరిశీలించారు. సర్పంచ్‌లు శ్రీరామూర్తి, ప్రసాద్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

యుద్ధాన్ని వ్యతిరేకించండి

నిడదవోలు, న్యూస్‌టుడే: పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న జాతి నిర్మూలన యుద్ధాన్ని వ్యతిరేకించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు ఈమని గ్రీష్మకుమార్ అన్నారు. పార్టీ పిలుపుమేరకు పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా మంగళవారం నిడదవోలులో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సభ్యుడు తీపర్తి వీర్రాజు, నాయకులు లంకాడ గణపతి, పిచ్చా సూర్యకిరణ్, మల్లిడి వెంకటరామిరెడ్డి, సత్యనారాయణ, బాపినీడు, సిరిల్ తదితరులు పాల్గొన్నారు.



నిరసనలో ఐఎఫ్‌టీయూ నాయకులు

నెలకు రూ.10 వేల గౌరవ వేతనం ఇవ్వాలి

గోపాలపురం: జిల్లా పరిధిలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన పథక కార్మికులకు నెలకు రూ.10 వేలు గౌరవ వేతనం ఇవ్వాలని మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. బుచ్చిబాబు డిమాండ్ చేశారు. గోపాలపురంలో మంగళవారం పాఠశాలలో పని చేస్తున్న కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ పథక కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మండల స్థాయి నుంచి కమిటీలను బలోపేతం చేస్తున్నామన్నారు. ఆ కమిటీల ద్వారా పోరాటం చేస్తామన్నారు. సత్యవతి, అనంతలక్ష్మి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బుచ్చిబాబు

ప్రజాభిమానంతోనే ఉన్నత పదవులు

చాగల్లు, దేవరపల్లి: ప్రజలు చూపిన అభిమానంతోనే తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా ఎదిగానని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. మంగళవారం రాత్రి చాగల్లు ఊనగట్ల, తదితర గ్రామాల్లోని దుర్గమ్మ ఆలయాలను దర్శించుకుని, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను సత్కరించారు. కూటమి ప్రభుత్వ పరిపాలనలో రాష్ట్రం స్వర్ణాంధ్రగా మారనుందన్నారు. కార్యక్రమంలో నాయకులు, అభిమానులు పాల్గొన్నారు. ★ దుర్గామాత చల్లని దీవెనలతో గోపాలపురం నియోజకవర్గ ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు కోరారు. దేవరపల్లిలోని పల్లపు వీధి రామాలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారిని ఆయన స్థానిక తెదేపా నాయకులతో దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో గన్నమని హరికృష్ణ, సుంకర దుర్గారావు, గద్దే సుబ్రహ్మణ్యం, ఉప్పులూరి రామారావు, తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న రవిప్రకాష్ తదితరులు

ఉద్యమాలను తీవ్రం చేస్తాం

చాగల్లు, కొవ్వూరు పట్టణం: ఏలూరుపాడులో అంబేడ్కర్ ఫ్లెక్సీని చింపి అవమానపరిచిన ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు, దళిత వైద్యునిపై దౌర్జన్యం చేసిన ఎమ్మెల్యే పంతం నానాజీలను అరెస్టు చేయాలని మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బొంతా శ్యామ్ రవిప్రకాష్ డిమాండ్ చేశారు. స్థానిక మెరకవీధిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సంఘ సభ్యులు నిరసన తెలియచేస్తూ నినాదాలు చేశారు. ఆయన మాట్లాడుతూ త్వరలో కార్యాచరణ ప్రకటించి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో తరిపే బంగారయ్య, బి.లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

పాడి, పంటల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

చాగల్లు, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ప్రతి రైతు అభివృద్ధితోపాటు పాడి, పంటలకు ప్రణాళికతో కూడిన కార్యాచరణను రూపొందించి, అమలు చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చాగల్లులో మంగళవారం నిర్వహించిన ఉచిత గర్భకోశ పశుచికిత్స శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు అందిస్తున్న పలు పశువుల మందుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పాడి పరిశ్రమ అభివృద్ధికి అందిస్తున్న పలు సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆళ్ల హరిబాబు, నాదెళ్ల శ్రీరామ్, కరుటూరి సతీష్, డీడీ సత్యనారాయణ, ఏడీ వెంకటరెడ్డి, మండల పశువైద్యాధికారి ముఖేష్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.



పశువులు మందులు అందిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

అత్యవసర వసతులు కల్పించేలా చర్యలు

తాళ్లపూడి, న్యూస్‌టుడే: ప్రజలకు అత్యవసరమైన తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు తదితర కనీస వసతులను కల్పించేలా దృష్టిసారించాలని ఎంపీడీవో రమణ తెలిపారు. మండలపరిషత్తు కార్యాలయంలో పంచాయతీరాజ్ చట్టంపై ఆయా గ్రామాల ఉపసర్పంచులు, ఇద్దరు వార్డు సభ్యులకు మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీలు చేసే తీర్మానాలు, వీధి దీపాలు, సంపద కేంద్రాలు, తాగునీరు సరఫరా తదితర అంశాలను ఆయప వివరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్జాన్, ఏఎస్‌వో వెంకటేశ్వరరావు, ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ వీరన్న, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ అమ్మిరాజు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌పై కేసు

చాగల్లు, కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: గత నెల 28వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌పై పట్టణ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. హెచ్‌సీ సాంబమూర్తి తెలిపిన వివరాల ప్రకారం కొవ్వూరు డివిజనల్ కోఆపరేటివ్ కార్యాలయంలో ఉద్యోగిగా పని చేస్తున్న జి.రాహుల్ జవహర్ విధులు ముగించుకుని నిడదవోలులోని ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా మున్సిపల్ స్టేడియం వద్దకు వచ్చే సరికి ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలైన రాహుల్ జవహర్‌ను రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. జవహర్ తల్లి స్వరూపారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ సాంబమూర్తి తెలిపారు.

మహిళ అదృశ్యంపై...

నిడదవోలు: పొన్నుతాయి అనే మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు నిడదవోలు ఎస్సై శోభన్ కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. తమిళనాడుకు చెందిన పొన్నుతాయి కుటుంబం గత 40 ఏళ్లుగా నిడదవోలు పట్టణంలోని బస్టాండ్ రోడ్డులో అద్దెకు ఉంటోంది. ఈ నెల 7న మధ్యాహ్నం సమయంలో పొన్నుతాయి భర్త పళనిస్వామి వారి కుమారుడిని రైలు ఎక్కించడానికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి ఆమె ఇంట్లో లేదన్నారు. చుట్టుపక్కల వెతికినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో ఫిర్యాదు చేశారన్నారు. తనకు మానసికంగా బాగుండటం లేదని తన గురించి వెతకవద్దని నోట్ రాసి, తన ఒంటిపైనున్న బంగారం అంతా తీసివేసి డ్రెస్సింగ్ టేబుల్‌లో పెట్టి వెళ్లిపోయిందన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామన్నారు.

ద్విచక్ర వాహనం స్వాధీనం

తాళ్లపూడి, న్యూస్‌టుడే: చోరీకి గురైన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని, ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. వివరాల ప్రకారం.. కడియం మండలం పొట్టిలంకకు చెందిన కొత్తపల్లి నారాయణ ఈనెల 5న ద్విచక్ర వాహనంపై తాళ్లపూడి బజారుకు వచ్చారు. అక్కడ వాహనం నిలిపి అల్పాహారం తిని తిరిగి వచ్చేసరికి వాహనం కనిపించలేదు. దీనిపై నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కొవ్వూరు మండలం పెనకనమెట్టకు చెందిన ఆనందెల్లి వీర్రాజు అపహరణకు గురైన ద్విచక్రవాహనంపై వస్తుండగా గుర్తించి అరెస్టు చేసి, వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

పాలకోడేరు: పలు జిల్లాల్లో వరుస చోరీలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్న అంతర్రాష్ట్ర దొంగను అరెస్టు చేసినట్లు భీమవరం రూరల్ సీఐ బి.శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చాగల్లు గ్రామానికి చెందిన డొక్కు సాయికిరణ్ జల్సాల కోసం చోరీలకు పాల్పడుతున్నాడు. పశ్చిమగోదావరి జిల్లాలో పాలకోడేరు, ఉండి, పాలకొల్లు రూరల్ పోలీస్ స్టేషన్లలో అతడిపై చోరీ కేసులు నమోదయ్యాయి. అతడి కదలికలపై నిఘా పెట్టిన పోలీసులు గొల్లలకోడేరు వద్ద మంగళవారం అరెస్టు చేశారు. చోరీ చేసిన సొత్తును ఆకివీడు మండలం గుమ్ములూరుకు చెందిన మండా రాజేశ్‌కు ఇస్తున్నట్లు గుర్తించి అతడ్ని కూడా అరెస్టు చేశారు. వారి నుంచి రూ.3 లక్షల విలువైన కెమెరాలు, ల్యాప్‌టాప్‌లు, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. భీమవరం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండు విధించినట్లు తెలిపారు.